MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 280 | పేజీలు : 8 | మంగళవారం 29 సెప్టెంబర్ 2026 | వెల : 6-00





పల్లె పండుగ 3.0

గౌ॥ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
శ్రీ నారా చంద్రబాబునాయుడు

గౌ॥ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి
శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గార్ల చేతుల మీదుగా
రూ.11,085 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

తేదీ : సెప్టెంబర్ 29, 2026 **సమయం :** మ. 02:30 గంటలకు
వేదిక : ఉదయగిరి, SPSR నెల్లూరు జిల్లా

పల్లె పండుగ 3.0 అభివృద్ధి పనులు

- రూ.2,700 కోట్లతో 6,000 కి.మీ.ల సీసీ రోడ్లు
- రూ.300 కోట్లతో 22,000 మినీ గోకులాలు
- రూ.7,550 కోట్లతో 9,500 కి.మీ.ల బీటీ రోడ్లు
- రూ.110 కోట్లతో 1,000 కి.మీ.ల మ్యాజిక్ డ్రెయిన్లు
- రూ.225 కోట్లతో 50,000 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు
- రూ.200 కోట్లతో బస్ షెల్టర్లు, పంచాయతీ భవనాలు, రచ్చబండలు

కేంద్రం వాటా రూ.5,391 కోట్లు.. **రాష్ట్రం వాటా** రూ.5,694 కోట్లు..

జారీచేసిన వారు: సంచాలకులు, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

పల్లె నిండుగా అభివృద్ధి పండుగ! ప్రతి గ్రామానికి అభివృద్ధి... ప్రతి ఇంటికీ సంక్షేమం!

జలవనరులు కలుషితం కాకుండా చూడాలి

-మొదటిపేజీ తరువాయి

దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 119 ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, 12 ఆక్వా ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయని పీసీబీ అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. అక్కడ చేసే తనిఖీలు, నమూనాల సేకరణ, పరీక్షల నిర్వహణకు సంబంధించిన విషయాలను తెలియజేశారు. ఈ క్రమంలో స్పందించిన ఆక్వా ప్రాసెసింగ్, ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్లలో క్రమం తప్పకుండా నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని అధికారులు సూచించారు. తద్వారా సమస్యలను ముందుగానే గుర్తించి నివారించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఉల్లంఘనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆక్వా యూనిట్లు పర్యావరణ ప్రమాణాలు సమర్థవంతంగా పాటించేలా చేయడమే లక్ష్యమని పవన్ స్పష్టం చేశారు.

పరవాడ కాలుష్యంపై పవన్ స్పందన

మరోవైపు అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీ సమీపంలోని డ్రెయిన్లు, వర్షపు నీటి కాలువల్లో నల్లటి రంగుతో కూడిన నీరు ప్రవహిస్తోందని దీంతో దుర్వాసన వస్తోందని శుక్రవారం నాడు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరు వీడియో పోస్ట్ చేశారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్? స్పందించారు. ఈ మేరకు ఆ ప్రాంతంలో పర్యటించి వాస్తవ పరిస్థితులపై సమగ్ర నివేదిక సమర్పించాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. వీడియో ఆధారంగా ఆయా ప్రాంతాల్లోని మురుగు కాలువల్లో తనిఖీలు చేపట్టారు. శుద్ధి చేయని వ్యర్థాలతో కూడిన నీటిని ఇందులోకి విడుదల చేసినట్టు గుర్తించారు. ఈ మేరకు దీనిపై వివరణ కోరుతూ 95 కంపెనీలకు షోకాజ్? నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షపు నీటిని నిల్వ చేసే ఏర్పాట్లు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ మురుగునీరు లేదా కలుషిత నీటిని బయటకు విడుదల చేయరాదని చెప్పారు.

ఎఫ్లుయెంట్, ప్రమాదకర వ్యర్థాలను క్రమం తప్పకుండా శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని అధికారులు తెలిపారు. శుద్ధి చేసిన వ్యర్థాలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని కనీసం ఆరు నెలల పాటు భద్రపరచాలన్నారు. కన్‌సెంట్ టు ఆపరేట్ , హాజర్డస్ వేస్ట్ అనుమతుల నిబంధనలను కచ్చితంగా పాటించాలని చెప్పారు. అక్రమంగా మురుగునీరు, ప్రమాదకర వ్యర్థాలు, ఉప ఉత్పత్తుల వంటి వాటిని విడుదల చేస్తున్నట్లు నిర్ధారణయితే ఆయా పరిశ్రమలపై పర్యావరణ నిబంధనలను అనుసరించి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న పరిశ్రమలను ఉపేక్షించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే షోకాజ్ నోటీసులపై స్పందించేందుకు పరిశ్రమలకు ఏడు రోజుల సమయమిచ్చారు. నిర్దేశిత సమయంలో సంతృప్తికరమైన వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ మేరకు తీసుకున్న చర్యలను వివరిస్తూ ఒక నివేదికను ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించారు. మరోవైపు అధికారుల చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

1.66 లక్షల మంది అనర్హులు

-మొదటిపేజీ తరువాయి

నిర్ణయించింది. మరో 57,040 మంది విచారణ పూర్తయినప్పటికీ వారు సమర్పించిన ఆధారాల పరిశీలన కొనసాగుతోంది. 4,434 మంది విచారణ ఇంకా పెండింగ్‌లో ఉంది. అర్హులుగా 96 శాతం మంది : జులై 31న ఎన్నికల సంఘం ముసాయిదా జాబితా విడుదల చేసింది. 3,71,38,182 మంది ఓటర్ల వివరాలను అందులో ప్రచురించింది. ఎన్యూమరేషన్ పత్రాల్లో వివరాలు సరిగ్గా నింపలేదనే కారణంతో 44,28,845 మందికి నోటీసులిచ్చింది. దాదాపు విచారణ పూర్తి చేసి 96 శాతం మందిని
అర్హులుగా తేల్చింది.

మిగతా 3,27,09,337 ఓటర్లలో 3,27,08,479 మందిని తుది జాబితాలో కొనసాగించేందుకు అర్హులుగా గుర్తించింది. మరో 858 మందికి సంబంధించిన విచారణ పెండింగ్‌లో ఉంది. ఓటు హక్కు నమోదుకు కొత్తగా వచ్చిన ఫాం-6లలో 85,736, చిరునామాలు, పేర్లు, ఇతర వివరాల్లో మార్పులు, చేర్పులకు వచ్చిన ఫాం-8లలో 40,991, అనర్హుల ఓట్లు తొలగించాలంటూ వచ్చిన ఫాం-7లలో 9,296 దరఖాస్తుల విచారణ పెండింగ్‌లో ఉంది.

పెండింగ్ దరఖాస్తుల విచారణను అక్టోబరు 5కల్లా పూర్తిచేసి 9న తుది జాబితా ప్రచురించనుంది.

అత్యధికంగా అనంతపురం జిల్లాలో

నోటీసులందుకున్న ఓటర్లలో అత్యధికంగా అనంతపురం జిల్లాలో 22,943 మంది, తిరుపతి జిల్లాలో 19,596 మంది, పల్నాడులో 18,843 మంది, ఎన్టీఆర్ జిల్లాలో 12,509, అన్నమయ్యలో 12,098 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 11,227 మందిని అనర్హులుగా తేల్చారు.

గుర్తించిన లోపాలు

ఎన్యూమరేషన్ పత్రాల పరిశీలనలో తల్లిదండ్రులు -- పిల్లల మధ్య వయస్సు తేడా 15 ఏళ్ల కంటే తక్కువగా, 50 ఏళ్ల కంటే ఎక్కువగా నమోదు కావడం, ఓటరు--తాత లేదా నాన్నమ్మ మధ్య వయస్సు తేడా 40 ఏళ్ల కంటే తక్కువగా ఉండటం వంటి లోపాలను అధికారులు గుర్తించారు. అలాగే ప్రస్తుత జాబితా, 2002 జాబితాలో తండ్రి పేరులో తేడాలు ఉండటం, ఒకే తల్లిదండ్రులకు చెందిన పిల్లల మధ్య వయస్సు తేడా 9 నెలల కంటే తక్కువగా నమోదు కావడం, ఓటర్ల పేర్లు, తల్లిదండ్రుల వివరాల్లో తప్పులు వంటి లోపాలు కూడా వెలుగుచూశాయి.

క్షేత్రస్థాయిలో పర్యటించండి

-మొదటిపేజీ తరువాయి

ఆవేదన చెందుతున్నారు. పెట్టుబడి మొత్తం నీటి పాలుకావడంతో లబోదిబోమంటున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ క్రమంలోనే ప్రజాప్రతినిధులు ప్రభావిత ప్రాంతాలను సందర్శించి, రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

పకడ్బందీగా పూర్తి చేయాలి

ఈ క్రమంలోనే తీవ్ర వాయుగుండం ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టాల ఎన్యుమరేషన్‌ను వేగంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించి, ప్రతి బాధిత రైతు వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఒక్క రైతు కూడా నష్ట పరిహారానికి సంబంధించిన వివరాల నమోదు నుంచి మిగిలిపోకూడదని, ఎన్యుమరేషన్‌లో పారదర్శకత, కచ్చితత్వం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వాయుగుండం కారణంగా 14 జిల్లాల్లోని 89 మండలాలు, 351 గ్రామాల్లో ఉద్యానవన పంటలు ప్రభావితమయ్యాయని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. 1734 హెక్టార్లలో పంటలు దెబ్బతినడంతో 5777 మంది రైతులు నష్టపోయినట్లు గుర్తించారు. వ్యవసాయ పంటల విషయానికొస్తే 190 మండలాల్లోని 1,229 గ్రామాల్లో 44,029 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. మొత్తం 71,796 మంది అన్నదాతలకు పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. జిల్లాల వారీగా, పంటల వారీగా సమగ్ర నష్టం వివరాలను వీలైనంత త్వరగా ప్రభుత్వానికి అందించాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

15 వేల ప్రమోషన్లు ఇచ్చాం.. ఇంకా ధర్నాలెందుకు?

-మొదటిపేజీ తరువాయి

మంత్రి స్పష్టత ఇచ్చారు. నోషనల్ ఇంక్రిమెంట్లు ఎవరికీ ఇవ్వడం సాధ్యం కాదని, కాబట్టి సచివాలయ ఉద్యోగులకు కూడా ఇవ్వలేమని తేల్చిచెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగానే చూస్తున్నామని, గత ప్రభుత్వం నియమించిందన్న వివక్ష తమకు లేదని అన్నారు. వారి కోసం ప్రత్యేకంగా ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు చేసిందే తమ ప్రభుత్వమని గుర్తుచేశారు. వారి సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, అయితే ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

జాతీయ రాజకీయాల్లో జగన్ దారెటు?

హైదరాబాద్

కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామకం, సవరణ చట్టంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సోషల్ మీడియాలో చేసిన ప్రకటన జాతీయ స్థాయిలో పెద్ద దుమారాన్నే రేపింది. పరీక్ష రాసే విద్యార్థే ఎగ్జామినర్‌ను నియమించుకున్నట్లుగా ప్రభుత్వమే సీఈసీని ఎంచుకోవడం ఏంటి " అని జగన్ లేవనెత్తిన ప్రశ్న సహేతుకమైనదే అయినప్పటికీ, దానికి ఆయన ఎంచుకున్న సమయం, గతంలో ఆయన పార్టీ తీసుకున్న పార్లమెంటరీ నిర్ణయాలు ఆయన రాజకీయ విధానాలను ప్రశ్నించేలా చేస్తున్నాయి. నిన్నటివరకు కేంద్ర చట్టాలకు సభలో మద్దతు పలికి, ఇప్పుడు విమర్శలకు దిగడంపై జాతీయ విపక్షాలు జగన్ మోహన్ రెడ్డిని ద్వంద్వ నీతి ప్రదర్శిస్తున్నారన్న విమర్శలకు కారణం అవుతున్నాయి. ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ ఫైర్‌బ్రాండ్ ఎంపీ మహువా మొయిత్రా సోషల్ మీడియా వేదికగా జగన్‌కు నేరుగానే ఘాటు కౌంటర్ ఇచ్చారు. వ్యవస్థలను ధ్వంసం చేసే వారికి ముందు పార్లమెంట్‌లో మద్దతు ఇవ్వడం ఆపండి.. ఆ తర్వాత గ్యాలరీ సమాధానాల కోసం మాట్లాడండి అంటూ ఆమె నేరుగా విమర్శలు గుప్పించారు. ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి ని తప్పిస్తూ కేంద్రం తీసుకువచ్చిన బిల్లుకు పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ మద్దతు పలికిన విషయాన్ని, కనీసం వాకౌట్ కూడా చేయకపోవడాన్ని ఈ సందర్భంగా జాతీయ నేతలు గుర్తు చేస్తున్నారు.వైఎస్ జగన్ రాజకీయ విధానంలో అనుసరిస్తున్న అంశాల వారీ మద్దతు వ్యూహమే ఆయనను డిఫెన్స్‌లో పడేస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు కేంద్రంలోని బీజేపీకి దాదాపు ప్రతి కీలక బిల్లు ఆర్టికల్



370 రద్దు, త్రిపుల్ తలాక్, ఢిల్లీ సర్వీసెస్ బిల్లు, ఈసీ నియామక బిల్లు ముందస్తుగా మద్దతు పలికి, ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చాక అవే నిర్ణయాలను తప్పుపట్టడం వల్ల ఆయన రాజకీయ విశ్వసనీయత దెబ్బతింటోంది. జాతీయ స్థాయిలో ప్రతిపక్షాలు కూటమిగా ఏర్పడి బీజేపీ విధానాలను మొదటి నుంచీ సైద్ధాంతికంగా వ్యతిరేకిస్తుంటే, జగన్ మాత్రం సొంత రాష్ట్రాభివృద్ధి లేదా ఇతర సమీకరణాల పేరుతో కేంద్రానికి సహకరించారు. అయితే ఇప్పుడు ఏపీలో అధికారం కోల్పోయిన తర్వాత, ఎన్నికల కమిషన్ తీరుపై సొంతంగా అనుమానాలు వచ్చినప్పుడు మాత్రమే గళం విప్పడం వల్ల, జాతీయ విపక్షాలు ఆయనను సులభమైన రాజకీయ అవకాశవాది గా చూసే పరిస్థితి ఏర్పడింది. ఒక నిర్దిష్టమైన సిద్ధాంతం లేదా పొలిటికల్ ఐడియాలజీ లేకపోవడం వల్లనే ఆయన తీరుపై ఇలాంటి విమర్శలు వస్తున్నాయి.ప్రస్తుత పరిస్థితుల్లో జాతీయ స్థాయిలో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీ వంటివి జగన్ వైఖరిని ఎండగడుతున్నాయి. ముందు పాలసీ ప్రకారం రాజకీయాలు చేయండి.. బీజేపీ తెచ్చే ప్రజాస్వామ్య వ్యతిరేక బిల్లులను పార్లమెంట్‌లో ఓడించకుండా మద్దతు ఇచ్చి, తీరా నష్టం జరిగిన తర్వాత రోడ్డెక్కి మాట్లాడటం వల్ల ఉపయోగం లేదు అని ఆయా పార్టీలు హెచ్చరిస్తున్నాయి. కేంద్రంతో వైఎస్సార్‌సీపీకి ఉన్న లోపాయికారీ అవగాహన వల్లే వారు ఇలా సగం దూరంలో ఆగిపోతున్నారనే ప్రచారం వ్యాపిస్తోంది. ఈ పరిణామాలు జగన్ మోహన్ రెడ్డి రాజకీయ భవిష్యత్తుకు , జాతీయ ఇమేజ్‌కు పెద్ద పరీక్షగా మారాయి. మారుతున్న రాజకీయాల్లో మధ్యస్థ వైఖరి, అవకాశవాద మద్దతు పనిచేయదని, ఏదో ఒక వైపు స్పష్టమైన స్టాండ్ తీసుకోవాల్సిందేనని ఈ వివాదం స్పష్టం చేస్తోంది. మరి ఇప్పటికైనా జగన్ తన జాతీయ రాజకీయ విధానంపై స్పష్టత తెచ్చుకుంటారో లేదా ఇలాగే డబుల్ గేమ్ విమర్శలను ఎదుర్కొంటూ సాగుతారో వేచి చూడాలి.

పండుగ సీజన్‌లో మోటరోలా స్మార్ట్‌ఫోన్లపై భారీ ఆఫర్లు

విశాఖపట్నం



మోటరోలా తన "ఇట్స్ ది టైమ్ టు మోటో" ప్రచారంలో భాగంగా ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్ 2026 సందర్భంగా చబిగ్‌బిలియన్‌మోటోడీల్స్‌ను ప్రకటించింది. పండుగ సీజన్‌ను పురస్కరించుకుని తమ స్మార్ట్‌ఫోన్‌లపై ప్రత్యేక ధరలను అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. సెప్టెంబర్ 27 నుంచి ఫ్లిప్‌కార్ట్‌లో ప్రారంభమైన ఈ సేల్‌లో వినియోగదారులకు పలు మోడళ్లను ఆకర్షణీయమైన ధరలకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది. రూ.30 వేలలోపు మోటరోలా ఎడ్జ్ 70 ఫ్యూజన్‌లో ఫ్లాగ్‌షిప్ స్థాయి ఫీచర్లు, రూ.40 వేలలోపు మోటరోలా ఎడ్జ్ 70 ప్రో‌లో ప్రీమియం ఫీచర్లు అందిస్తున్నట్లు తెలిపింది. రూ.45 వేలలోపు మోటరోలా ఎడ్జ్ 70 ప్రో‌లో క్వాడ్ 50 మెగాపిక్సెల్ కెమెరా సెటప్, రూ.60 వేలలోపు మోటరోలా సిగ్నేచర్‌లో అధునాతన కెమెరా అనుభవాన్ని అందిస్తున్నట్లు వెల్లడించింది. అలాగే రూ.20 వేలలోపు మోటో జీ37 పవర్ స్మార్ట్‌ఫోన్‌లో మూడు రోజుల వరకు బ్యాటరీ సామర్థ్యాన్ని అందిస్తున్నట్లు పేర్కొంది. బిగ్ బిలియన్ డేస్ సందర్భంగా తమ స్మార్ట్‌ఫోన్‌లపై ప్రత్యేక ధరలు వినియోగదారులకు అందుబాటులో ఉంటాయని మోటరోలా తెలిపింది.

ప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టి

అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యను పరిష్కరించండి

అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ

జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 200 అర్జీలు



విజయవాడ, మహానగర్

జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌లో జేసీ ఇలక్కియ.. అధికారులతో కలిసి ప్రజల నుంచి 200 అర్జీలు స్వీకరించారు. రెవెన్యూకు సంబంధించి 67, పోలీసు శాఖకు 29, ఎంఏయూడీకు 22, సహకార శాఖకు 17, విద్యకు ఏడు, డీఆర్‌డీఏకు 7, పంచాయతీరాజ్ శాఖకు 6, వైద్య ఆరోగ్య శాఖకు 6, కాలుష్య నియంత్రణ మండలికి 5 అర్జీలు వచ్చాయి. ఇంటర్మీడియెట్ విద్య, ఉపాధికల్పనకు నాలుగు చొప్పున, విభిన్న ప్రతిభావంతులు, గ్రామీణ నీటి సరఫరా శాఖలకు మూడు చొప్పున, ఎస్‌జీఎస్‌డబ్ల్యూ, గృహ నిర్మాణం, మహిళా శిశు సంక్షేమం శాఖలకు రెండు చొప్పున అర్జీలు అందాయి. విద్యుత్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, వ్యవసాయం, బీసీ సంక్షేమం, దేవాదాయ, బ్యాంకింగ్ సేవలు, మెప్మా, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, పౌర సరఫరాలు, ఇరిగేషన్, సాంకేతికవిద్య, జాతీయ రహదారులు, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్‌లకు ఒక్కో అర్జీ వచ్చాయి. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీ వెనుక ఒక సమస్యతో పాటు ప్రజల ఆశ, నమ్మకం ఉంటుందని పేర్కొన్నారు. అర్జీదారులతో అవసరమైన సందర్భాల్లో నేరుగా మాట్లాడి సమస్య స్వరూపాన్ని తెలుసుకోవాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, పరిష్కారంలో జాప్యం జరిగితే అందుకు గల కారణాలను పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ ప్రభుత్వంపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా అధికారులు పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు

మహాకవి గుర్రం జాషువా

జాషువా సాహిత్య స్ఫూర్తితో సమసమాజ నిర్మాణానికి కృషి చేయాలి

రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

విజయవాడ, మహానగర్



సామాజిక అసమానతలపై కలంతో పోరాడి, అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి తన సాహిత్యం ద్వారా స్వరం అందించిన మహోన్నత వ్యక్తి మహాకవి గుర్రం జాషువా అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గుర్రం జాషువా 131వ జయంతి వేడుకలను రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య కళా వేదికలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్య వికాసానికి విశేష కృషి చేసిన షేక్ కరీముల్లా, డాక్టర్ జాలాది విజయకుమారి, విల్సన్ రావు కొమ్మవరపు, గడ్డం ఈశ్వరమ్మలకు 'కవిసామ్రాట్ గుర్రం జాషువా కవికోకిల సాహితీ పురస్కారాలు' అందజేశారు. ఒక్కొక్కరికి రూ.50 వేల నగదు ప్రోత్సాహకంతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని మంత్రి అందించి సత్కరించారు. జాషువా తన 'గబ్బిలం', 'ఫిరదౌసి' తదితర రచనల ద్వారా మానవ హక్కులు, సమానత్వం, సామాజిక న్యాయం కోసం సమాజాన్ని చైతన్యపరిచారని మంత్రి పేర్కొన్నారు. అంటరానితనం, మూఢాచారాలను ప్రశ్నిస్తూ అక్షరాన్ని ఆయుధంగా మలిచారని కొనియాడారు. జాషువా ఆశయాల స్ఫూర్తితో సమసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కళలు, కళాకారులు, కవులకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో జాషువా పద్యాలు రచించారని కొనియాడారు. సృజనాత్మక, సంస్కృతి సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ జాషువా కవిత్వం సమాజంలోని వివక్షను ప్రశ్నిస్తూ మార్పు కోసం ఆలోచింపజేస్తుందని అన్నారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు, పలువురు సాహితీవేత్తలు, కళాకారులు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 280 | పేజీలు : 8 | మంగళవారం 29 సెప్టెంబర్ 2026 | వెల : 6-00



భారత్‌తో మాది మంచి భాగస్వామ్యం

- కానీ ఉపయోగించుకోలేకపోయాం: ఆస్ట్రేలియా ప్రధాని
- భారత్, ఆస్ట్రేలియా భాగస్వామ్యం మరింత పెరగాల్సి ఉందన్న అల్బనీస్
- ప్రధాని మోదీతో కలిసి సంబంధాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్న ఆస్ట్రేలియా ప్రధాని
- డిసెంబరులో భారత్‌కు వ్యాపార ప్రతినిధి బృందంతో పర్యటన

5



తెలంగాణ సీజేకు ప్రమోషన్

- ముగ్గురు జడ్జిలను సిఫారసు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం
- మూడు రాష్ట్రాల హైకోర్టు సీజేలను సుప్రీంకోర్టు జడ్జిలుగా పదోన్నతికి సిఫారసు
- తెలంగాణ, గుజరాత్, దిల్లీ హైకోర్టు సీజేల పదోన్నతికి సిఫారసు

1.66 లక్షల మంది అనర్హులు




- అక్టోబర్ 9న ఓటర్ల తుది జాబితా
- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా సమర్పించిన ఎన్యూమరేషన్ పత్రాల్లో అవసరమైన వివరాలు నింపలేదని ఓటర్లకు నోటీసులు జారీ
- 44,24,411 మంది విచారణను ఆదివారానికి పూర్తి చేసింది.
- తుది ఓటర్ల జాబితా అక్టోబర్ 9న విడుదల

అమరావతి, మహానగర్

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా సమర్పించిన ఎన్యూమరేషన్ పత్రాల్లో అవసరమైన వివరాలను నింపకపోవడం, తప్పులు, అసంపూర్ణంగా సమాచారాన్ని అందించడం వంటి కారణాలతో నోటీసులు అందుకున్న 44,24,411 మంది ఓటర్లకు సంబంధించిన విచారణను భారత ఎన్నికల సంఘం ఆదివారానికి పూర్తి చేసింది. అనర్హులుగా 1,66,279 మంది : నోటీసులు అందుకున్న 44,24,411 మంది ఓటర్లలో 1,66,279 మందిని అనర్హులుగా తేల్చింది. 42,01,092 మందిని తుది జాబితాలో కొనసాగించాలని - మిగతా2లో

నేపాల్‌లో జల విలయం



- 6 సెకన్లలో కళ్లముందే కుప్పకూలి నదిలో కలిసిపోయిన భారీ కొండ
- వరదలు, కొండచరియల వల్ల 24 మంది మృతి, పలువురు గల్లంతు
- హిమపాతంలో చిక్కుకుని మరో ఇద్దరు మృతి, 10 మంది గల్లంతు

5లో

జలవనరులు కలుషితం కాకుండా చూడాలి

- జలవనరుల పరిరక్షణ, కాలుష్య నివారణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత
- ఆక్వా వ్యర్థాలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్ష
- ఆక్వా వ్యర్థాల నుంచి వచ్చే అనర్థాల నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు
- ప్రాసెసింగ్ యూనిట్లలో పర్యావరణ ప్రమాణాల అమలుకు ప్రత్యేక పర్యవేక్షణ
- పరిమితికి మించి హానికారక రసాయనాలు ఉండడం వల్ల నదులు, కాలువలు, భూగర్భ జలాలు కాలుష్యం బారినపడుతున్నాయి



అమరావతి, మహానగర్

ఆక్వా వ్యర్థాల కారణంగా జలవనరులు కలుషితం కాకుండా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆక్వా ప్రాసెసింగ్, ఆక్వా ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్లు నిర్దేశిత పర్యావరణ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చూడాలన్నారు. ఆక్వా కాలుష్యంపై ఇవాళ మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. శు ద్ధి చేయని ఆక్వా వ్యర్థాల్లో పరిమితికి మించి హానికారక రసాయనాలు ఉండడం వల్ల నదులు, కాలువలు, భూగర్భ జలాలు కాలుష్యం బారినపడుతున్నాయని పవన్ కల్యాణ్ చెప్పారు. ఫలితంగా ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బ తింటున్నాయని వివరించారు. జలవనరుల పరిరక్షణ, కాలుష్య నివారణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. ఆక్వా ప్రాసెసింగ్, ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి వెలువడుతున్న కాలుష్య ప్రభావం, నివారణ చర్యలపై అధికారులకు - మిగతా2లో

15 వేల ప్రమోషన్లు ఇచ్చాం.. ఇంకా ధర్నాలెందుకు?

- సచివాలయ ఉద్యోగుల డిమాండ్లపై మంత్రి స్వామి
- ఉద్యోగులను వైఎస్ జగన్ రెచ్చగొడుతున్నారని మంత్రి స్వామి ఆరోపణ
- అక్రమ ధర్నాలు, ఒత్తిళ్లు సహించేది లేదని హెచ్చరిక
- నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టీకరణ
- రెండు క్యాజువల్ లీవులకు ఉన్నతాధికారుల అనుమతి అవసరం లేదన్న మంత్రి



అమరావతి, మహానగర్

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇప్పటికే 15 వేల మందికి పైగా ప్రమోషన్లు ఇచ్చామని, సమస్యలు పరిష్కరిస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని రాష్ట్ర మంత్రి డీఎస్‌బీవీ స్వామి స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అక్రమంగా ధర్నాలు చేస్తే సహించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. సోమవారం అమరావతిలో మంత్రి స్వామి మీడియాతో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల ఆందోళనలపై ప్రభుత్వ వైఖరిని వెల్లడించారు. గత ప్రభుత్వం సరైన సర్వీస్ రూల్స్ లేకుండా నోటిఫికేషన్లు ఇచ్చిందని, తమ ప్రభుత్వం వాటిని సరిదిద్దిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో సచివాలయ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించినట్లు వివరించారు. దీనిలో భాగంగా రెండు క్యాజువల్ లీవులను ఉన్నతాధికారుల అనుమతి లేకుండా వాడుకునే వెసులుబాటు కూడా కల్పించామని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనల వెనుక ఎవరున్నారనే దానిపై విచారణ జరుపుతామని చెబుతూనే, ఈ ఆందోళనలకు జగనే కారణమని మంత్రి స్వామి ఆరోపించారు. “గతంలో రూ.15,000 జీతానికి రెండేళ్లు పనిచేసినప్పుడు నిరసన తెలపని వారు, ఇప్పుడు ఎందుకు ఆందోళన చేస్తున్నారని ప్రశ్నించారు. గత పీఆర్సీలో వీరిని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు?” అని నిలదీశారు. కొన్ని డిమాండ్లపై - మిగతా2లో

క్షేత్రస్థాయిలో పర్యటించండి

- పంటనష్టం వివరాలను త్వరగా అందించండి
- తీవ్రవాయుగుండం కారణంగా కురిసిన వర్షాలతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు
- వరదలతో పంటలు నీట మునిగి దిక్కుతోచని స్థితిలో పడ్డారు
- తీవ్ర వాయుగుండం ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు పర్యటించాలని అచ్చెన్నాయుడు ఆదేశం



అమరావతి, మహానగర్

ఇటీవల తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఏపీలో వర్షాలు దంచికొట్టాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయ్యాయి. తీర ప్రాంతాలు చిగురుటాకులా వణికాయి. నదుల్లో ఉద్ధృతి అంతకంతకూ పెరిగింది. వాగులు, వంకలు పొంగి పొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాలు జలదిగ్బంధమయ్యాయి. మరోవైపు బలమైన గాలుల ధాటికి చెట్లు విరిగి పడటంతో పాటు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అరటి, బొప్పాయి, కొబ్బరి తోటలు దెబ్బతిన్నాయి. పొలాలు చెరువులను తలపించాయి. పంటలు నీట మునగడంతో అన్నదాతలు - మిగతా2లో

విజయవాడ ఉత్సవ్-2.0ను విజయవంతం చేద్దాం

- విజయవాడ సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవాన్ని దేశానికి చాటడమే లక్ష్యం
- ఉత్సవ్‌తో పర్యాటకం, స్థానిక వ్యాపారాలకు కొత్త అవకాశాలు
- 650 స్టాళ్లతో పున్నమి ఘాట్‌లో నేషనల్ సరస్ మేళా
- విజయవాడ ఉత్సవ్ ట్రైలర్, పాట, పోస్టర్ల ఆవిష్కరణ



విజయవాడ, మహానగర్

నగర సాంస్కృతిక, ఆధ్యాత్మిక, చారిత్రక వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పడంతో పాటు పర్యాటకం, స్థానిక వ్యాపారాలు, ఉపాధి అవకాశాలను ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్--2.0కు అంబేద్కర్ కళా వేదికలో కర్టెన్ రైజర్ కార్యక్రమం ఘనంగా జరిగింది. గత ఏడాది ప్రజల భాగస్వామ్యంతో విజయవంతమైన విజయవాడ ఉత్సవ్‌ను ఈ ఏడాది మరింత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. విజయవాడ ఉత్సవ్ కేవలం సాంస్కృతిక కార్యక్రమం కాదని, నగర బ్రాండ్‌ను పెంచడంతో పాటు పర్యాటకం, వాణిజ్యం, స్థానిక ఉపాధికి వేదికగా నిలవాలన్నదే లక్ష్యమన్నారు. దసరా సందర్భంగా విజయవాడకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో నగర ప్రజలు వారికి ఆతిథ్య భావంతో స్వాగతం పలకాలని, ఇళ్లు, వ్యాపార సంస్థలను ప్రత్యేకంగా అలంకరించి పండుగ వాతావరణాన్ని తీసుకురావాలని పిలుపునిచ్చారు. విజయవాడ ఉత్సవ్‌కు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. స్థానిక వ్యాపారులు, చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, కళాకారులకు ఉత్సవ్ ద్వారా ఆదాయ, ఉపాధి అవకాశాలు పెరగాలని ఆకాంక్షించారు. పున్నమి ఘాట్‌లో తొలిసారిగా నిర్వహిస్తున్న నేషనల్ సరస్ మేళాలో మొత్తం 650 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా డ్వాక్రా, స్వయం సహాయక సంఘాల మహిళలు తమ ఉత్పత్తులను ప్రదర్శించి మార్కెటింగ్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని, ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘాలకు 230 స్టాళ్లు కేటాయిస్తున్నట్లు వివరించారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ విజయవాడ ఉత్సవ్ వినోద కార్యక్రమాలకే పరిమితం కాకుండా స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఎకనామిక్ ఇంజన్‌గా మారాలని ఆకాంక్షించారు. ఉత్సవ్ ద్వారా స్థానిక వ్యాపారాలు, ఆటో డ్రైవర్లు, కళాకారులకు ఆదాయ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. తోలుబొమ్మలాట, తప్పెటగుళ్లు వంటి అంతరించిపోతున్న జానపద కళలను ప్రోత్సహించాలని, పద్య, పౌరాణిక నాటకాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ విజయవాడకు చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవం ఉందని, విజయవాడ ఉత్సవ్ ద్వారా నగర ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి చాటుతున్నామని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ఉత్సవ్ నిర్వహించడం అభినందనీయమన్నారు. దసరా సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజయవాడ ఉత్సవ్ ట్రైలర్, పాట, పోస్టర్లను మంత్రులు కందుల దుర్గేష్, సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు కలిసి ఆవిష్కరించారు. విజయవాడ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రూపొందించిన ట్రైలర్, పాట ఆకట్టుకున్నాయి. జిజ్ఞాస ఆధ్వర్యంలో నిర్వహించే కాంపిటీషన్ పోస్టర్లను కూడా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోండా ఉమా, వెనిగండ్ల రాము, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం





- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- 51వ సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం
- 22 ఏళ్ల తర్వాత ఏపీలో జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు
- దేశవ్యాప్తంగా 54 జట్ల నుంచి యువ క్రీడాకారులు.. మొత్తం 146 మ్యాచ్‌లు
- విజేతకు రూ.3 లక్షల నగదు బహుమతి

విజయవాడ స్పోర్ట్స్, మహానగర్

పటమట ఇండోర్ స్టేడియం వేదికగా 51వ సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ ఘనంగా ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన యువ క్రీడాకారులు పాల్గొంటున్న ఈ ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి పోటీలకు విజయవాడ ఆతిథ్యం ఇవ్వడం ఆనందంగా ఉందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. 22 ఏళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ నిర్వహించడం గర్వకారణమన్నారు. రాష్ట్రంలో క్రీడలకు, ముఖ్యంగా యువ క్రీడాకారుల ప్రోత్సాహానికి మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో 54 జట్లు పాల్గొంటుండగా మొత్తం 146 మ్యాచ్‌లు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. విజేత జట్టుకు రూ.3 లక్షలు, రన్నరప్‌కు రూ.2 లక్షలు, మూడో స్థానంలో నిలిచే జట్టుకు రూ.1 లక్ష నగదు బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. చిన్న వయసులోనే క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులను తీర్చిదిద్దవచ్చని ఎంపీ చిన్ని అన్నారు. జాతీయ స్థాయి పోటీల నిర్వహణతో విజయవాడకు క్రీడా నగరంగా మరింత గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. క్రీడాకారులకు మెరుగైన వసతులు, శిక్షణ, పోటీ వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం, క్రీడా సంఘాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బాస్కెట్‌బాల్‌తో పాటు అన్ని క్రీడల్లో యువతను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో తమిళనాడు క్రీడా శాఖ మంత్రి అధవ్ అర్జున్, విజయవాడ ఎమ్మెల్యే గద్దె రామమోహన్, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి, ఉపాధ్యక్షులు, కోశాధికారి, నిర్వాహకులు, క్రీడాకారులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు

ఈహెచ్ఎస్ నిధులు ప్రతినెలా సకాలంలో ట్రస్ట్‌కు జమ
ఏపీ ఎన్జీజీవోస్ నేతల హర్షం

విజయవాడ, మహానగర్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు హెల్త్ కార్డుల ద్వారా మెరుగైన నగదు రహిత వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ స్వాగతించారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) కింద ఉద్యోగులు, పెన్షనర్లకు వైద్య సేవలు అందించడంలో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తమ సంఘం నిరంతరం కృషి చేసిందని తెలిపారు. ఎంపానెల్డ్ ఆసుపత్రులకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం, ప్యాకేజీ రేట్ల సమస్యలు, నగదు రహిత వైద్య సేవలు అందించడంలో ఆసుపత్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 5న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఉద్యోగ సంఘాల సమావేశంలోనూ హెల్త్ కార్డుల అంశాన్ని ప్రస్తావించి, ఉద్యోగులు, పెన్షనర్లకు నిరంతరాయంగా నగదు రహిత వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్ల కంట్రిబ్యూషన్‌తో పాటు ప్రభుత్వం అందించే మ్యాచింగ్ గ్రాంట్ ద్వారా నెలకు సుమారు రూ.34 కోట్ల నిధులు హెల్త్ స్కీమ్‌కు సమకూరుతున్నాయని వివరించారు. ఈ నిధులను ప్రతి నెలా సకాలంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్--ఈహెచ్ఎస్ ఖాతాకు జమ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం వల్ల ఆసుపత్రుల బిల్లుల చెల్లింపుల్లో జాప్యం తగ్గి, ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్య సేవలు మరింత సజావుగా అందే అవకాశం ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో ప్యాకేజీ రేట్ల పునర్విమర్శ, ఉద్యోగుల కంట్రిబ్యూషన్‌పై సమీక్ష, అవసరమైతే బీమా విధానాన్ని పరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య భద్రత కల్పించే ప్రభుత్వ చర్యలకు తమ సంఘం సంపూర్ణ సహకారం అందిస్తుందని ఎ. విద్యాసాగర్, డి.వి. రమణ తెలిపారు.



దసరా ఉత్సవాల్లో భక్తుల భద్రతే ప్రథమ ప్రాధాన్యం

హోల్డింగ్ ఏరియాలు, క్యూలైన్ల ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ రాజశేఖర బాబు పరిశీలన

సీసీటీవీ, ఏఐ నిఘాతో 24 గంటలూ పర్యవేక్షణ

పోలీస్, దేవస్థానం సమన్వయంతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు



విజయవాడ, మహానగర్:

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో జరగనున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల నేపథ్యంలో భక్తుల రద్దీ నియంత్రణ, భద్రత, ట్రాఫిక్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు తెలిపారు. ఇతర పోలీస్ అధికారులతో కలిసి వినాయక టెంపుల్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న హోల్డింగ్ ఏరియాలు, క్యూలైన్లు, బారికేడింగ్, భక్తుల రాకపోకల మార్గాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రద్దీ తీవ్రంగా ఉండే సమయాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వారిని వేచి ఉంచేందుకు అవసరమైన హోల్డింగ్ ప్రాంతాలను పరిశీలించి ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు. సామాన్య భక్తులు ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకునేలా పోలీస్, దేవస్థానం అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఉత్సవాల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సీసీటీవీ కెమెరాలు, ఏఐ ఆధారిత నిఘా వ్యవస్థల ద్వారా భక్తుల భద్రతను 24 గంటలూ పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. క్యూలైన్ల నిర్వహణ, బారికేడింగ్, రద్దీ నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ పరిశీలనలో డీసీపీ జి. రామకృష్ణ, పశ్చిమ ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గుణరామ్, దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. రమ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 99 ఫిర్యాదులు



విజయవాడ క్రైమ్, మహానగర్

ప్రజా సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు సోమవారం 99 ఫిర్యాదులు అందాయి. పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు ఆదేశాల మేరకు డీసీపీ ఉదయారాణి, ఏసీపీ వెంకటేశ్వరరావు కార్యక్రమాన్ని నిర్వహించి బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అందిన ఫిర్యాదుల్లో భూ, ఆస్తి వివాదాలు, నగదు లావాదేవీలకు సంబంధించి 30, భార్యాభర్తలు, కుటుంబ కలహాలకు సంబంధించి 9, వివిధ రకాల మోసాలకు సంబంధించి 9, మహిళా సంబంధిత నేరాలకు సంబంధించి 10, కొట్లాటలకు సంబంధించి 3, దొంగతనాలకు సంబంధించి 5, ఇతర వివిధ సమస్యలకు సంబంధించి 33 ఫిర్యాదులు ఉన్నాయి. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీసు అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ఈ వేదికను వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని ఫిర్యాదుల పరిష్కారానికి సహకరించారు.

మెరుగైన వైద్యం కోసం ఎల్ఓసీలు అందజేత



విజయవాడ, మహానగర్

ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎమ్మెల్యే సుజనా చౌదరి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ)లను మంజూరు చేస్తున్నారు. ఆయన ఆదేశాల మేరకు ఎన్డీయే కూటమి నేతలు భవానిపురంలోని పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయంలో బాధితుల కుటుంబాలకు సోమవారం ఎల్ఓసీ పత్రాలను అందజేశారు. వించిపేటకు చెందిన ముకేష్ చాబ్రియ (39) శ్వాసకోశ, మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ వైద్య సాయం కోసం దరఖాస్తు చేసుకోగా రూ.8 లక్షల విలువైన ఎల్ఓసీ మంజూరైంది. కొత్తపేటకు చెందిన నాగ జీవన్ కుమార్ (35) రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో వైద్య సాయం కోసం దరఖాస్తు చేసుకోగా రూ.4.30 లక్షల విలువైన ఎల్ఓసీ అందజేశారు. 38వ డివిజన్‌కు చెందిన కాగిత బిందు రామలక్ష్మి (31) ఒక రోజు వయసున్న తన నవజాత శిశువుకు అత్యవసర వైద్యం కోసం దరఖాస్తు చేసుకోగా రూ.12.68 లక్షల విలువైన ఎల్ఓసీ మంజూరైంది. బాధితుల వైద్య అవసరాలపై త్వరితగతిన స్పందించి ఎల్ఓసీలు మంజూరు చేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరికి బాధితుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు కొప్పుల గంగాధర్, ఈగల సాంబశివరావు, బొడ్డుపల్లి శ్రీనివాస్, బెవర శ్రీనివాస్, పచ్చవ మల్లికార్జునరావు బాధితుల కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ పత్రాలను అందజేశారు.

తెలంగాణ సీజేకు ప్రమోషన్



సుప్రీం కోర్టుకు కొత్తగా ముగ్గురు న్యాయమూర్తులు రానున్నారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో సోమవారం సమావేశమైన కొలీజియం మూడు రాష్ట్రాల హైకోర్టుల సీజేల పేర్లను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని నిర్ణయించింది. వీరిలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్, దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ ఉన్నారు. "2026 సెప్టెంబర్ 28న జరిగిన సమావేశంలో సుప్రీంకోర్టు కొలీజియం, కింది హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించాలని సిఫార్సు చేసింది. జస్టిస్ సునీతా అగర్వాల్, ప్రధాన న్యాయమూర్తి, గుజరాత్ హైకోర్టు (మూల హైకోర్టు: అలహాబాద్) జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, ప్రధాన న్యాయమూర్తి, దిల్లీ హైకోర్టు (మూల హైకోర్టు: అలహాబాద్) జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (మూల హైకోర్టు: ఝార్ఖండ్)" అని సుప్రీం కోర్టు ఓ ప్రకటనలో పేర్కొంది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌తో పాటు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ పీఎస్ నరసింహ సుప్రీంకోర్టు కొలీజియంలో సభ్యులుగా ఉన్నారు. సుప్రీం కోర్టులో మంజూరైన న్యాయమూర్తుల సంఖ్య 38 కాగా, ప్రస్తుతం 34 మంది న్యాయమూర్తులు ఉన్నారు. ఈ సిఫార్సులను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోద ముద్ర వేసిన తర్వాత కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ వీరి నియామకాల ఉత్తర్వుల్ని జారీ చేస్తుంది.

అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్, 2023 జూలై నుంచి గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె 1990లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. 2011 నవంబర్?లో అలహాబాద్ హైకోర్టుకు పదోన్నతి పొందారు. పదోన్నతి పొందితే సుప్రీం కోర్టు పదవీ విరమణ వయస్సు అయిన 65 సంవత్సరాలకు చేరుకోవడానికి ఆమెకు దాదాపు ఐదు సంవత్సరాల సమయం ఉంటుంది.

జస్టిస్ ఉపాధ్యాయ 2023 జూలై నుంచి బొంబాయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. ఆ తర్వాత 2025 జనవరి నుంచి దిల్లీ హైకోర్టు సీజేగా కొనసాగుతున్నారు. ఆయన 1991లో న్యాయవాదిగా నమోదు చేసుకుని, 2011 నవంబర్?లో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. పదోన్నతికి ముందు, ఆయన ఉత్తర ప్రదేశ్ ప్రధాన స్టాండింగ్ కౌన్సెల్‌గానూ పనిచేశారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ అపరేషన్ సింగ్, పట్నా, ఝార్ఖండ్ హైకోర్టుల్లో ప్రాక్టీస్ చేశారు. జస్టిస్ సింగ్ దిల్లీ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం అభ్యసించారు. ఆయన 1990 నుంచి 2000 వరకు పట్నా హైకోర్టులో, ఆ తర్వాత 2012లో ఝార్ఖండ్ హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందే వరకు అక్కడే న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2022 డిసెంబర్ 20 నుంచి 2023 ఫిబ్రవరి 19 వరకు ఆ హైకోర్టుకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. అనంతరం త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొంది 2023 ఏప్రిల్ 17న ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత 2025 జూలైలో తెలంగాణ హైకోర్టు బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు సుప్రీంకోర్టుకు న్యాయమూర్తులుగా కొత్తగా ఐదుగురిని నియమించింది కొలీజియం. పంజాబ్ హరియాణా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శీల్‌నాగు, బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీచంద్రశేఖర్, మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ, జమ్మూకశ్మీర్-లద్దాఖ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరుణ్‌పల్లి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వెంకిట సుబ్రమణి మోహన పేర్లను సుప్రీంకోర్టు న్యాయమూర్తి పదవులకు పదోన్నతి కల్పించింది.

'సర్' వివాదం
సీఈసీ రాజీనామాకు ఖర్గే డిమాండ్.. ప్రతిపక్షంపై నడ్డా ఫైర్



ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ క్రమంలో ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, సర్, ఈసీ వ్యవహారంపై కాంగ్రెస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. మరోవైపు కేంద్ర మంత్రి జేపీ నడ్డా ప్రతిపక్ష ఆరోపణలను ఖండిస్తూ, ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. 'సర్' వివాదం ఒక్క పార్టీకి సంబంధించిన అంశం కాదని, దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థకు సంబంధించిన విషయమని ఖర్గే పేర్కొన్నారు. అందుకే కాంగ్రెస్ ఈ అంశాన్ని తీవ్రంగా తీసుకుంటుందని చెప్పారు. సర్ అంశంపై చర్చించేందుకు మంగళవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇక జ్ఞానేశ్ కుమార్ బీజేపీ సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తున్నారని, ఆ పార్టీ కార్యకర్తగా మారారని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఆయన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

జైరాం రమేశ్ విమర్శలు

సర్ ప్రక్రియలో పౌరసత్వానికి సంబంధించిన అంశాలను పరిశీలించే విధానం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ఉందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జైరాం రమేశ్ ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని తిరిగి బలోపేతం చేసే సుదీర్ఘ ప్రక్రియలో తొలి అడుగు సీఈసీ రాజీనామాతోనే ప్రారంభం కావాలని ఆయన పేర్కొన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుధాన్షు ధూలియా ఓ ఇంటర్వ్యూలో ఇచ్చిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. ఓటరు దేశ పౌరుడై ఉండాల్సిందేనని, అయితే పౌరసత్వాన్ని నిర్ణయించడం ఎన్నికల సంఘం బాధ్యత కాదని చెప్పినట్లు తెలిపారు. పౌరసత్వానికి సంబంధించి విస్తృతమైన షరతులు విధించడంపైనా ఆయన ప్రస్తావించినట్లు గుర్తు చేశారు. భారత పౌరసత్వం 1955 పౌరసత్వ చట్టం పరిధిలోకి వస్తుందని, పార్లమెంట్ కాలానుగుణంగా చేసిన సవరణలకు అనుగుణంగా ఈ చట్టం అమలులో ఉంటుందని చెప్పారు.

ఖర్గే వ్యాఖ్యలకు నడ్డా కౌంటర్

కాంగ్రెస్ విమర్శలకు కేంద్రమంత్రి జేపీ నడ్డా స్పందించారు. ఈసీపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని పేర్కొన్నారు. ఈసీ ఇప్పటికే తమ వివరణ ఇచ్చిందని, అయినప్పటికీ ప్రతిపక్ష నేతలు అదే ఆరోపణలను కొనసాగిస్తున్నాయని విమర్శించారు. లోక్?సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తదితర ప్రతిపక్ష నేతలు ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాల కంటే ఆరోపణలు, గందరగోళానికి ప్రాధాన్యత ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. రాజ్యాంగబద్ధమైన, స్వతంత్ర సంస్థలపై ప్రశ్నలు లేవనెత్తడం ప్రతిపక్ష రాజకీయాల్లో ప్రధాన అంశంగా మారిందని ఆరోపించారు. రాహుల్ గాంధీని ఉద్దేశించి ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పినంత మాత్రాన అది నిజం కాదని తెలిపారు. ఈసీ ఇచ్చిన వివరణల తర్వాత కూడా ప్రతిపక్షాలు ఆరోపణలు కొనసాగిస్తున్నాయని విమర్శించారు.

సర్, ఓటర్ల జాబితాకు సంబంధించిన కొన్ని నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు 10 నెలల వ్యవధిలో కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు పలు కథనాలు వెలువడ్డాయి. ఫారం-6, ఓటర్ల పేర్ల తొలగింపు, ఎలక్టోరల్ రోల్ డేటాబేస్‌కు సంబంధించిన అంశాలపై ఈ అభ్యంతరాలు ఉన్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. అయితే ఎన్నికల సంఘం మాత్రం ఈ అభిప్రాయాలు నిర్ణయాత్మక దశకు ముందు జరిగే సాధారణ పరిపాలనా ప్రక్రియలో భాగమని తెలిపింది. తుది నిర్ణయాలు మాత్రం ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు పేర్కొంది. సీఈసీ జ్ఞానేశ్? కుమార్? రాజీనామా చేయాలని కాంగ్రెస్?తో పాటు సీపీఐ, సీపీఐ(ఎం), టీఎంసీ, శివసేన(యూబీటీ) వంటి ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఆయనపై అభిశంసనకు కూడా సిద్ధమయ్యాయి.

'హర్మూజ్ జలసంధి నుంచి అమెరికా దళాలను తరిమికొట్టాం




హర్మూజ్ జలసంధి నుంచి అమెరికా దళాలను అరేబియా సముద్రం వైపు తరిమికొట్టినట్లు ఇరాన్ సుప్రీంలీడర్ మొజ్తబా ఖమేనీ తెలిపారు. త్వరలోనే శత్రువులను అరేబియా సముద్రం నుంచి కూడా తరిమికొడతామని చెప్పారు. హర్మూజ్ జలసంధిలో శత్రుదేశాలు స్వేచ్ఛగా సంచరించకుండా తమ దళాలు అడ్డుకున్నాయని ప్రశంసించారు. యుద్ధం, చర్చల్లో ఏదొకటి తేల్చుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇరాన్ తేల్చిచెప్పింది. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు ఇరాన్ చేసిన ప్రతిపాదనలను ట్రంప్ తిరస్కరించిన వేళ ఇరాన్ ప్రకటన చర్చనీయాంశంగా మారింది. అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. మరో దఫా దాడులకు సిద్ధమని ఇరు దేశాలు ప్రకటించడం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఈ క్రమంలోనే హెజ్‌బొల్లా మాజీ నాయకుడు హసన్ నస్రల్లా వర్ధంతి సందర్భంగా మొజ్తబా ఖమేనీ ఇరాన్ పౌరులను ఉద్దేశించి ఒక ప్రత్యేక సందేశం పంపారు. హర్మూజ్ జలసంధి నుంచి అమెరికా దళాలను అరేబియా సముద్రం వైపు తరిమికొట్టినట్లు ఖమేనీ తెలిపారు. త్వరలోనే శత్రువులను అరేబియా సముద్రం నుంచి కూడా తరిమికొడతామని చెప్పారు. హర్మూజ్ జలసంధిలో తమ సైనికుల చేతిలో చావు దెబ్బ తిన్న శత్రువులు, అరేబియా సముద్రం దాటి ముందుకు రావడానికి సాహసించడం లేదన్నారు. ఇరాన్‌పై దాడులకు దిగిన ప్రతిసారి శత్రువులు భారీ నష్టాన్ని మూటగట్టుకున్నారని పేర్కొన్నారు. "ఇరాన్?లోని రెండు దక్షిణ సముద్రాలు శత్రు బలగాలు సంచరించే ప్రదేశాలుగా ఉండేవి. అయితే, హర్మూజ్ జలసంధిలో ధైర్యవంతులైన ఇరాన్? యోధుల నుంచి వారు పొందిన ఎదురుదెబ్బల కారణంగా అరేబియా సముద్రాన్ని దాటి ముందుకు రావడం లేదు. వారు ఈ వైపునకు వచ్చి, తమకు తామే హానిని తెచ్చుకున్నారు. త్వరలోనే అరేబియా సముద్రం కూడా వారి నుంచి విముక్తి పొందుతోంది. మనల్ని బలహీనపరచడానికి శత్రువులు నిరంతరం ప్రయత్నిస్తున్నారు. కానీ ఇప్పుడు సమాజంలోని వివిధ వర్గాల మధ్య స్పష్టమైన విభేదాలు ఉన్నప్పటికీ, పవిత్రమైన హర్మూజ్ జలసంధి పరిరక్షణతో సహా తమ హక్కులను నిలబెట్టుకోవడంలో దృఢంగా నిలబడుతున్నారు." అటు హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు తాము చేసిన ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించగా ఇరాన్ దీటుగా స్పందించింది. అమెరికా మళ్లీ దాడులకు దిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ హెచ్చరించారు. అవసరమైతే అంతిమ యుద్ధానికి కూడా వెనుకాడమని స్పష్టం చేశారు. అదే సమయంలో శాంతి చర్చలకు సిద్ధమని ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఏది కావాలో ట్రంప్ తేల్చుకోవాలని అన్నారు. శాంతి కోసమే తాము న్యూయార్క్ వెళ్లామని కాళ్లబేరానికి కాదని అరాగ్చీ వెల్లడించారు. జప్తు చేసిన తమ ఆస్తులు, నిధులను విడుదల చేస్తే హర్మూజ్ జలసంధిని తిరిగి తెరుస్తామని పునరుద్ఘాటించారు. అయితే, ఇరాన్ ప్రతిపాదనను తిరస్కరించడానికి కొన్ని కారణాలున్నాయని ఐరాసలో అమెరికా రాయబారి మైక్ వాల్జ్ తెలిపారు. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడి చేసి, అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘించిందని మండిపడ్డారు. అందుకే వారిపై తమకు నమ్మకం లేదని అన్నారు. ఇరాన్ అణు ముప్పు నుంచి ప్రపంచాన్ని రక్షించేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్యలు తీసుకుంటున్నారని మైక్ వాల్జ్ వెల్లడించారు. ఇరాన్‌తో జరుగుతోన్న యుద్ధంలో అతి త్వరలోనే అమెరికా విజయం సాధిస్తుందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. మధ్యంతర ఎన్నికలకు ముందే ఇరాన్‌పై సైనిక దాడులు జరిగే అవకాశాన్ని కొట్టిపారేయలేమని చెప్పారు. యుద్ధాన్ని తాము గెలిచిన వెంటనే ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు భారీగా పడిపోతాయన్నారు. ఇరాన్ చేతికి అణ్వాయుధాలు చిక్కకుండా చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ట్రంప్ పునరుద్ఘాటించారు. ఆపరేషన్ ఎకనామిక్ జెట్‌కాస్ట్‌పై మాట్లాడిన ట్రంప్, సైనిక, ఆర్థిక మార్గాల ద్వారా తాము విజయం సాధిస్తామన్నారు. మిలిటరీ పరంగా తాము ఇప్పటికే గెలిచామని, ఆర్థిక ఆంక్షల వల్ల ఇరాన్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందన్నారు. వారి కరెన్సీకి విలువ లేకుండా పోయిందని ఇరాన్‌లో ద్రవ్యోల్బణం దాదాపు 300 నుంచి 318 శాతానికి చేరుకుందన్నారు. అమెరికా నేవీ దిగ్బంధనంతో పోర్టుల ద్వారా ఎగుమతులు నిలిచిపోవడంతో ఇరాన్ ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించింది. పొరుగు దేశాల నుంచి సరకులను ఎగుమతి చేస్తోంది. ముఖ్యంగా ఇరాన్- తుర్కియే సరిహద్దు వద్ద కొన్ని కిలోమీటర్ల మేర లారీలు బారులు తీరాయి. రవాణా ఆంక్షలు, తనిఖీల కారణంగా ట్రక్కులు కొన్నిసార్లు వారాలపాటు సరిహద్దులోనే నిలిచిపోవాల్సి వస్తోంది.

నేపాల్‌లో జల విలయం



నేపాల్‌లో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ముస్తాంగ్ జిల్లాలో ఒక భారీ పర్వత భాగం కొద్ది సెకన్ల వ్యవధిలోనే కుప్పకూలి నదిలో కలిసిపోయిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ భయానక దృశ్యాలు ఆ దేశంలో నెలకొన్న విపత్కర పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. ముస్తాంగ్ జిల్లాలోని లేటే సమీపంలో ఒక భారీ పర్వత భాగం కేవలం ఆరు సెకన్ల వ్యవధిలోనే కాళీ గండకి నదిలోకి జారిపడింది. చార్‌ధామ్ యాత్రికులు చిత్రీకరించిన ఈ వీడియోలో, కొండచరియలు వేగంగా కిందికి దూసుకురావడంతో స్థానికులు భయాందోళనలతో కేకలు వేయడం వినిపిస్తోంది. ఈ ఘటన కారణంగా నదీ ప్రవాహానికి తాత్కాలికంగా ఆటంకం ఏర్పడింది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న మరో వీడియోలో, కొండచరియలు విరిగిపడటంతో చెట్లతో పాటు ఒక ఇల్లు కూడా లోయలోకి కొట్టుకుపోయింది. 'ఘర్ గయా సక్యో (ఇల్లు పోయింది) అంటూ గ్రామస్థులు భయాందోళనలతో హాహాకారాలు చేయడం, ఒక మహిళ రోదిస్తున్న దృశ్యాలు చూసేవారిని కలచివేస్తున్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సంభవించిన వరదలు, కొండచరియల విరిగిపడిన ఘటనల్లో ఇప్పటివరకు 24 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 14 మంది గల్లంతయ్యారు. ప్రతికూల వాతావరణం కారణంగా పలు జిల్లాల్లో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. మరోవైపు, మనాంగ్ జిల్లాలోని హిమ్లుంగ్ హిమాల్ బేస్ క్యాంప్ వద్ద సంభవించిన హిమపాతంలో ఇద్దరు మరణించగా, మరో 10 మంది ఆచూకీ లభ్యం కాలేదు. నెల రోజుల క్రితం సంభవించిన భోటేకోశీ వరదల విషాదం నుంచి కోలుకోకముందే నేపాల్‌ను మరో విపత్తు చుట్టుముట్టడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

భారత్‌తో మాది మంచి భాగస్వామ్యం



భారత్‌తో తమ సంబంధాలకు మరింత విస్తరించే అవకాశం ఉందని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ తెలిపారు. ఇరు దేశాల మధ్య ఇప్పటికే మంచి భాగస్వామ్యం ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో ఉపయోగించుకోలేకపోయామని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, తాను కలిసి ఆ బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని వెల్లడించారు. ఈ మేరకు ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా న్యూయార్క్‌లో ఆసియా సొసైటీ నిర్వహించిన కార్యక్రమంలో అల్బనీస్ పలు వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని అల్బనీస్ తెలిపారు. తాను, మోదీ ఇద్దరూ ప్రధానులుగా ఉన్న సమయంలో ఒకరి దేశాన్ని మరొకరు రెండుసార్లు సందర్శించారని గుర్తు చేశారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు అవకాశం ఉందని చెప్పారు. భారత్‌లో విద్య, భాష, విశ్వవిద్యాలయాలు, క్రీడలు వంటి రంగాల్లో ఆస్ట్రేలియాతో ఇప్పటికే సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. రెండు దేశాలు కామన్వెల్త్‌లో భాగస్వాములు కావడం కూడా ప్రత్యేక అనుబంధానికి కారణమని చెప్పారు.

మోదీ సభలపై అల్బనీస్ ప్రశంసలు

ఆస్ట్రేలియాలో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా జరిగిన భారీ బహిరంగ కార్యక్రమాలను కూడా అల్బనీస్ ప్రస్తావించారు. మోదీ పాల్గొన్న స్టేడియం కార్యక్రమాల్లో కనిపించిన ఉత్సాహం అసాధారణమని అన్నారు. మెల్‌బోర్న్‌లో జరిగిన కార్యక్రమంలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారని గుర్తు చేశారు. ఆ కార్యక్రమాల్లో తనకు కూడా ప్రజలు మద్దతుగా నినాదాలు చేశారా అని అడిగినప్పుడు, మోదీ తనను ఉత్సాహపరచాలని అక్కడి ప్రజలను కోరడంతో వారు నినాదాలు చేశారని చెప్పారు. సుమారు 40 వేల మంది ఆస్ట్రేలియన్లు తన పేరును నినదించడం సాధారణ విషయం కాదని, మోదీతో తన స్నేహం కారణంగానే అది సాధ్యమైందని పేర్కొన్నారు. ఇక ఆస్ట్రేలియా ప్రధాని డిసెంబర్?లో భారత్‌లో పర్యటించనున్నారు. జీ20 సదస్సుకు అమెరికా వెళ్లే క్రమంలో భారత్‌కు వస్తానని ఆయన తెలిపారు. అమెరికాలో డిసెంబర్ 14, 15 తేదీల్లో జీ20 సదస్సు జరగనుంది. అంతకుముందు భారత్‌లో అల్బనీస్ పర్యటన కొనసాగనుంది. ఆ పర్యటనలో వ్యాపారం, సంస్కృతి, క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. 'జీ'డే నమస్తే పేరుతో ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నారు. ఇందులో ఆస్ట్రేలియా వ్యాపార సంస్థలు, ఇతర భాగస్వాములు పాల్గొననున్నారు.

ముంబయిలో వ్యాపార సమావేశాలు

భారత్ పర్యటనలో భాగంగా పెద్ద సంఖ్యలో ఆస్ట్రేలియా వ్యాపార ప్రతినిధులను ముంబయికి తీసుకొస్తానని అల్బనీస్ చెప్పారు. ఆస్ట్రేలియా బిజినెస్ కౌన్సిల్‌తో కలిసి వ్యాపార కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. భారత్‌లో పెట్టుబడులు, వ్యాపార అవకాశాలు, ఇరు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలపై ఆ కార్యక్రమాల్లో చర్చించే అవకాశం ఉంది. భారత్- ఆస్ట్రేలియా ఆర్థిక సంబంధాల్లో ఇంకా చాలా చేయాల్సి ఉందని అల్బనీస్ చెప్పారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు మరింత పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అల్బనీస్ పర్యటనలో క్రీడలకు కూడా ప్రత్యేక స్థానం ఉండనుంది. ముంబయిలో వ్యాపార కార్యక్రమాలు ముగిసిన తర్వాత చెన్నైలో క్రికెట్ మ్యాచ్‌తో పర్యటన కొనసాగుతుందని ఆయన చెప్పారు. విక్టోరియా, వెస్ట్రన్ ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆ మ్యాచ్ జరగనుంది. భారత్-ఆస్ట్రేలియా మధ్య క్రికెట్‌కు ఉన్న ప్రత్యేక అనుబంధాన్ని దృష్టిలో ఉంచుకుని ఆ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వ్యాపారం, సంస్కృతి, క్రీడలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలను మరింత పెంచే ప్రయత్నం చేస్తున్నారు. అయితే భారత్- ఆస్ట్రేలియా సంబంధాలు కేవలం వ్యాపారం, క్రీడలకే పరిమితం కావడం లేదు. రక్షణ, భద్రత, కీలక ఖనిజాలు, కొత్త సాంకేతికత, స్వచ్ఛ ఇంధనం, విద్య వంటి రంగాల్లోనూ ఇరు దేశాలు కలిసి పనిచేస్తున్నాయి. క్వాడ్‌లో భారత్, ఆస్ట్రేలియాతో పాటు అమెరికా, జపాన్ కూడా భాగస్వాములుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అల్బనీస్ డిసెంబరు పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

పండుగ సీజన్‌లో ఏఐఫ్లస్ నుంచి మూడు కొత్త పరికరాలు



విజయవాడ

పండుగ సీజన్‌ను పురస్కరించుకుని ఏఐఫ్లస్ స్మార్ట్‌ఫోన్ సంస్థ పల్స్ 2 ఎఫ్ఈ స్మార్ట్‌ఫోన్‌తో పాటు నోవాట్యాబ్, నోవా ల్యాప్‌ట్యాబ్ పరికరాలను విడుదల చేసింది. కమ్యూనికేషన్, విద్య, వినోదం, ఉత్పాదకత అవసరాలకు అనుగుణంగా వీటిని రూపొందించినట్లు సంస్థ తెలిపింది. పల్స్ 2 ఎఫ్ఈలో 6.67 అంగుళాల 120 హెర్ట్జ్ డిస్‌ప్లే, మీడియాటెక్ జీ81 ప్రాసెసర్, 50 మెగాపిక్సెల్ ఏఐ కెమెరా, 5,000 ఎంఏహెచ్ బ్యాటరీ, 4 జీబీ ర్యామ్, 64 జీబీ నిల్వ సామర్థ్యం, ఆండ్రాయిడ్ 16తో కూడిన నెక్స్ట్‌క్యూ ఓఎస్ ఉన్నాయి. నోవాట్యాబ్‌లో 11.97 అంగుళాల 90 హెర్ట్జ్ డిస్‌ప్లే, 5జీ అనుసంధానం, 8,000 ఎంఏహెచ్ బ్యాటరీ, 6 జీబీ లేదా 8 జీబీ ర్యామ్, 128 జీబీ నిల్వ సామర్థ్యం ఉన్నాయి. నోవా ల్యాప్‌ట్యాబ్‌లో 13.2 అంగుళాల 2.4కే 90 హెర్ట్జ్ డిస్‌ప్లే, స్టైలస్, జతచేయగల కీబోర్డు, 8 జీబీ ర్యామ్, 128 జీబీ నిల్వ సామర్థ్యం, 10,000 ఎంఏహెచ్ బ్యాటరీ అందించారు. పల్స్ 2 ఎఫ్ఈ ధర రూ.9,999 నుంచి, నోవాట్యాబ్ రూ.17,999 నుంచి, నోవా ల్యాప్‌ట్యాబ్ రూ.24,999గా నిర్ణయించారు. బ్యాంకు ఆఫర్లతో కూడిన ధరలు వర్తిస్తాయి. మూడు పరికరాలు అక్టోబర్ 7 రాత్రి 11.59 గంటల నుంచి ఫ్లిప్‌కార్ట్‌లో విక్రయానికి అందుబాటులో ఉంటాయి.

ఇన్‌ఫ్లూయెన్సర్లను సత్కరించడం అభినందనీయం
- రాష్ట్ర మంత్రి కందుల దుర్గేశ్

విజయవాడ, మహానగర్



తమ తమ రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తూ, సమాజంపై సానుకూల ప్రభావాన్ని చూపుతున్న ప్రతిభావంతులను గుర్తించి, వారి సేవలను అవార్డులతో సత్కరించడం అభినందనీయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. గ్లోబల్ ఐకాన్స్ ఫోరం సొసైటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 24న విజయవాడ క్లబ్‌లో నిర్వహించనున్న 'స్టేట్ ఇన్‌ఫ్లూయెన్సర్స్ అవార్డ్--2026' కార్యక్రమం పోస్టర్‌ను సోమవారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రతిభను చాటుతున్న వారిని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా యువతకు స్ఫూర్తి కలుగుతుందని, సమాజానికి తమ వంతు సేవ చేయాలనే ఉత్సాహం పెరుగుతుందని అన్నారు. ప్రతిభకు తగిన గుర్తింపు, గౌరవం లభించినప్పుడు రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు గ్లోబల్ ఐకాన్స్ ఫోరం సొసైటీ జాతీయ అధ్యక్షుడు చైతన్య జంగా, సెక్రటరీ జయ పటేరియాలను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా చైతన్య జంగా, జయ పటేరియా మాట్లాడుతూ 'స్టేట్ ఇన్‌ఫ్లూయెన్సర్స్' అంటే కేవలం సోషల్ మీడియా, డిజిటల్ రంగానికి చెందిన వ్యక్తులు మాత్రమే కాదని, తమ వృత్తి, రంగాల్లో ప్రతిభ, సృజనాత్మకత, సామాజిక సేవ, నాయకత్వం, విజయాలతో ఇతరులను ప్రభావితం చేసే వారిని కూడా గుర్తించి సత్కరించడమే ఈ అవార్డుల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సినీ, రాజకీయ, వ్యాపార, కార్పొరేట్, మీడియా తదితర రంగాలకు చెందిన ప్రముఖులు కార్యక్రమానికి హాజరై అవార్డు గ్రహీతలకు పురస్కారాలు అందజేయనున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, డిజిటల్ క్రియేటర్లు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొననున్నారని తెలిపారు. 'మన అమరావతి--మన రాజధాని' సందేశాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తరించడంతో పాటు అమరావతి అభివృద్ధి, ఆంధ్రప్రదేశ్ ప్రగతి, రాష్ట్ర ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యాల్లో ఒకటని నిర్వాహకులు తెలిపారు. 'మన ఇన్‌ఫ్లూయెన్సర్స్ అవార్డ్--2026'ను 'ప్రతిభకు గుర్తింపు... ప్రభావానికి గౌరవం... సృజనాత్మకతకు వేదిక...'గా అభివర్ణించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కోడె చైతన్య, డా. చిలకపాటి రామ్ చంద్, మిథాని ఈశ్వర్, రామిశెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 4న గాళ్ల సుబ్రహ్మణ్యం సంస్మరణ సభ

విజయవాడ, మహానగర్



కాపు సామాజిక వర్గ అభ్యున్నతితో పాటు అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేసిన మహోన్నత వ్యక్తి గాళ్ళ సుబ్రహ్మణ్యం అని ప్రముఖ రాజకీయ నాయకుడు, సామాజికవేత్త ఆకుల శ్రీనివాస్ కుమార్ కొనియాడారు. సోమవారం గాంధీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గాళ్ళ సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా, చిలంపూర్తి వీరస్వామి, మిరియాల వెంకట్రావు వంటి నేతల అడుగుజాడల్లో నడుస్తూ తన ఆరోగ్యం, కుటుంబం, ఆర్థిక పరిస్థితులను సైతం పక్కనపెట్టి గాళ్ళ సుబ్రహ్మణ్యం అనేక సామాజిక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించారని గుర్తుచేశారు. ఆయన అకాల మరణం కాపు వర్గానికే కాకుండా సమాజానికి తీరని లోటని అన్నారు. ఆయన అంతిమయాత్రలో కాపునాడు నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన ప్రముఖులు పాల్గొని ఘన నివాళులర్పించారని తెలిపారు. గాళ్ళ సుబ్రహ్మణ్యంతో సుదీర్ఘకాలం కలిసి పనిచేసిన కృష్ణప్రసాద్, జ్ఞానమయ్య, ప్రభు, అల్లం పూర్ణ, పన్నా, శ్రీధర్ తదితరులు మాట్లాడుతూ ఆయన స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. గాళ్ళ సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం అక్టోబర్ 4న 'ఎ ప్లస్' కల్యాణ మండపంలో ఘనంగా సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు, ఆయన సేవల ద్వారా లబ్ధి పొందిన వారు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులర్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అల్లం పూర్ణ, రవిశంకర్, కృష్ణ ప్రసాద్, జానీ, కన్నా, ప్రభు, పసుపులేటి శ్రీధర్, అంబటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జాషువా కవిత్వం తెలుగు నేల నుంచి విశ్వమానవత వైపు సాగిన గొంతుక
- ఎమ్మెల్యే కార్యాలయంలో జాషువా జయంతి

అవనిగడ్డ, మహానగర్



జాషువా కవిత్వం తెలుగు నేల నుంచి విశ్వమానవత వైపు సాగిన గొంతుక అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సోమవారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ ఆధ్వర్యంలో నవయుగ కవి చక్రవర్తి, విశ్వనరుడు గుర్రం జాషువా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రం జాషువా తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యానికి, మానవతావాదానికి ప్రతీకగా నిలిచిన మహాకవి అని తెలిపారు. కులవివక్ష, అస్పృశ్యత, పేదరికం, సామాజిక అసమానతలను తన కవిత్వం ద్వారా ప్రశ్నించి తెలుగు సాహిత్య చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించారన్నారు. జాషువా కవిత్వంలో కులం, మతం, వర్గం అనే గోడలకంటే మనిషితనం గొప్పదని, ప్రతి మనిషినీ సమానంగా చూడాలనే భావన ఆయన రచనలలో కనిపిస్తుందన్నారు. కులవివక్షకు వ్యతిరేకత, అస్పృశ్యత నిర్మూలన, సామాజిక సమానత్వం, పేదలు, అణగారిన వర్గాల పట్ల సానుభూతి, మానవతావాదం, దేశభక్తి, సామాజిక సంస్కరణ, స్వాభిమానం, ఆత్మగౌరవం జాషువా అభిమతం అన్నారు. జాషువా రచనల్లో గబ్బిలం, ఫిరదౌసి, క్రీస్తు చరిత్ర, ముంతాజ్ మహల్, కాందిశీకుడు జాషువా సమాజానికి ఇచ్చిన సందేశానికి ప్రతిబింబంలా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు యలవర్తి చిన్నా, బొందలపాటి వీరబాబు, జనసేన పార్టీ నాయకులు గరికపాటి శ్రీనివాసరావు, రేపల్లె మాధవ, గరికపాటి హరిబాబు, కుటుంబరావు, బాలు సుబ్రహ్మణ్యం, భోగాది బాలకృష్ణ, సుబ్బారావు, వాసు, అబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ మాదిరి.. రేవంత్!



హైదరాబాద్ : తెలంగాణలో త్వరలో జరగనున్న ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నిక కేవలం ఒక సాధారణ నియోజకవర్గ పోరుగానే కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ప్రభావం చూపే హై-వోల్టేజ్ ఫైట్ గా మారుతోంది. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వానికి, ఆయన వ్యూహాత్మక ఎత్తుగడలకు ఈ ఎన్నిక ఒక పెద్ద సవాల్‌గా నిలవనుంది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి ఎదుర్కొన్న రాజకీయ సవాళ్లను, నేటి రేవంత్ రెడ్డి రాజకీయ శైలితో బేరీజు వేస్తూ విశ్లేషకులు ఈ ఉపఎన్నికను అత్యంత ప్రతిష్టాత్మకంగా చూస్తున్నారు. ఒకప్పుడు వై.ఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో ఇదే తరహా రాజకీయ పరిణామాలు తలెత్తాయి. అప్పుడు దానం నాగేందర్ టీడీపీని వీడి కాంగ్రెస్‌లో చేరి ఆసిఫ్ నగర్ ఉపఎన్నిక బరిలో నిలిచారు. అయితే ఆ ఎన్నికల్లో దానం నాగేందర్ ఓడిపోయారు. అప్పట్లో వైఎస్సార్ ఆ ఎన్నికను వ్యక్తిగతంగా తీసుకోలేదని, అందుకే ఓడిపోయారని చెప్పుకునేవారు.అయితే ఇప్పుడు తెలంగాణ రాజకీయ వాతావరణం పూర్తిగా భిన్నంగా ఉంది. ముఖ్యమంత్రి పీఠంపై ఉన్న రేవంత్ రెడ్డి ప్రతి చిన్న పరిణామాన్ని అత్యంత సూక్ష్మంగా పరిశీలిస్తూ వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ గూటికి చేరిన దానం నాగేందర్ ఎదుర్కొంటున్న ప్రస్తుత రాజకీయ పరిణామాలు, భవిష్యత్ ఎన్నికల దిశను నిర్దేశించడంలో కీలక పాత్ర పోషించనున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ, అధికార పార్టీ తరఫున ఆయనే బరిలో నిలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.ఖైరతాబాద్ గడ్డపై త్రిముఖ పోరు అనివార్యంగా కనిపిస్తోంది. అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ ఈ ఉపఎన్నికను తమ సత్తా చాటుకునేందుకు సరైన వేదికగా భావిస్తున్నాయి. 2028 అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు ముందు ప్రజల నాడి ఎలా ఉందో తెలుసుకోవడానికి ఈ ఉపఎన్నిక ఒక లిట్మస్ టెస్ట్ లాంటిదని అన్ని పార్టీలు నమ్ముతున్నాయి.ఒకవైపు అధికార పార్టీగా సంక్షేమ పథకాలు, పాలనాపరమైన విజయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కాంగ్రెస్ భావిస్తుండగా, మరోవైపు క్షేత్రస్థాయిలో తమ పట్టును నిరూపించుకోవడానికి ప్రతిపక్షాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పుల నేపథ్యంలో నియోజకవర్గంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానం ఉందనే ధీమాతో ఉన్న దానం, ప్రత్యర్థుల వ్యూహాలను ఎదుర్కొనేందుకు సరికొత్త ప్రణాళికలు రచిస్తున్నారు. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార సరళి, పోలీసులు, స్థానిక ప్రజల స్పందన అన్నీ కూడా రాజకీయంగా ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి.ఈ ఉపఎన్నిక కేవలం దానం నాగేందర్ రాజకీయ భవిష్యత్తును మాత్రమే కాదు, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమను కూడా పరీక్షించనుంది. గతంలో వైఎస్సార్ ఎదుర్కొన్న రాజకీయ అడ్డంకులను అధిగమించి, ఈసారి రేవంత్ రెడ్డి సరికొత్త చరిత్రను తిరగరాస్తారా లేదా అనేది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. స్వయంగా సీఎం రంగంలోకి దిగి ప్రచార వ్యూహాలను పర్యవేక్షించే అవకాశం ఉండటంతో, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో కాస్త కాన్ఫిడెన్స్ కనిపిస్తోంది.

పాడిపై వేటు తప్పదా?



హైదరాబాద్ : పాడి కౌశిక్‌రెడ్డిపై అసెంబ్లీ ద్వారానే అనర్హత వేటు వేయించే యోచనలో కాంగ్రెస్ పార్టీ ఉందని బీఆర్ ఎస్ నాయకులు బహిరంగ వ్యాఖ్యలే చేస్తున్నారు. ఇదే జరిగితే.. ఖైరతాబాద్‌తో పాటు హుజూరాబాద్కు కూడా ఒకే సారి ఉప ఎన్నిక వచ్చే అవకాశం ఉందని అంచనా అంటున్నారు. అయితే.. దీనిని కాంగ్రెస్ పార్టీ కక్షపూరిత చర్య అని బీఆర్ ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. కాదు.. సభను అగౌరవపరిచిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని కాంగ్రెస్ చెబుతోంది. మొత్తంగా ఇప్పుడు పాడి చుట్టూ రాజకీయం మరోసారి రాజుకుంది. ఏడాది బడ్జెట్ సమావేశాల సమయంలో పాడి కౌశిక్ రెడ్డి సభలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా బీఆర్ ఎస్ నుంచి గెలిచి.. కాంగ్రెస్‌కు మద్దతుగా మారిన మాజీ మంత్రి కడియం శ్రీహరి ప్రసంగిస్తున్న సమయంలో ఆయనను అడ్డుకోవడంతోపాటు.. "నువ్వు" అని ఏకవచనంతో సంబోధించారు. అంతేకాదు.. దుర్భాషలాడారన్నది కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణ. అంతేకాదు.. తనను కాల్చేస్తానని కౌశిక్ రెడ్డి బెదిరించినట్టు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కడియం ఆరోపిస్తున్నారు. దీంతో వ్యవహారం ముదిరిపోయి.. అసెంబ్లీ ఎథిక్స్ కమిటీకి ఈ విషయాన్ని రిఫర్ చేశారు. ప్రస్తుతం ఈ కమిటీ తీవ్రంగా శోధిస్తోంది. పాడిపై వచ్చిన ఆరోపణలు, ఆయన హావభావాలను వీడియోల రూపంలో కూడా పరిశీలన చేస్తోంది. కాగా.. ఇంతలోనే దానం వ్యవహారం ఒక కొలిక్కి వచ్చింది. దీంతో ఇప్పుడు పాడి విషయం మరింత సీరియస్ అయింది. ఎథిక్స్ కమిటీ తీసుకునే నిర్ణయం అత్యంత ముఖ్యంగా మారడంతో పాడిపై వేటు వేయించడమో.. లేక రాజీనామాకు సిఫారసు చేయడమో ఖాయమని అంటున్నారు ఎథిక్స్ కమిటీ అనేది రాజ్యాంగ బద్ధమైన కమిటీ కావడం, దీనికి స్పీకర్ అనుమతి ఉండడంతో ఈ కమిటీ నిర్ణయాన్నికోర్టుల్లో సవాల్ చేసేందుకు అవకాశం లేదని అంటున్నారు. పాడి అనర్హుడు కావడమో.. రాజీనామా చేయడమో తప్పదు. దీంతో హుజూరాబాద్‌కు కూడా ఉప ఎన్నిక తీసుకురావాలన్నది కాంగ్రెస్ ప్లాన్‌గా చెబుతున్నారు. దీనిని అడ్డుకునేందుకు బీఆర్ ఎస్ నాయకులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా.. తను వివరణ ఇచ్చేందుకు ఆరు వారాలు గడువు ఇవ్వాలంటూ..పాడి కోరి మూడు వారాలైంది. దీంతో మరో రెండు వారాల్లోనే ఆయనపై నిర్ణయం వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది

బిజినెస్

ముందన్నీ పండుగలు..
ఎలక్ట్రానిక్స్ ధరలకు రెక్కలు!

ఈసారి పండగ సీజన్ ప్రారంభానికి ముందే వినియోగదారులకు షాక్ తగులబోతున్నది. ఏసీలు మొబైల్ ఫోన్‌లు , ఎల్ఈడీ టీవీలు వాషింగ్ మెషీన్‌లు రిఫ్రిజిరేటర్ల వంటి ఎలక్ట్రానిక్స్ ధరలు అక్టోబర్ 1 నుంచి పెరుగబోతున్నాయి. ప్రముఖ కంపెనీలు తమ ఉత్పత్తుల ధరలను 5 నుంచి 8 శాతం వరకు పెంచేందుకు సిద్ధమయ్యాయి. ఈ ఏడాదిలో ఇలా ధరలు పెంచడం ఇది మూడోసారి కావడం గమనించవలసిన విషయం. అల్యూమినియం, రాగి, ఉక్కు వంటి ముడిసరుకుల ధరలు భారీగా పెరగడం, రవాణా ఖర్చులు అధికమవడం.. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా కరెన్సీ మారకం విలువలో వస్తున్న హెచ్చుతగ్గులు ఈ పెంపునకు ప్రధాన కారణాలని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఏసీల ధరలు 5 నుంచి 8 శాతం మేర పెరగనుండగా.. టీవీలు, వాషింగ్ మెషిన్ల ధరలు 3-4 శాతం వరకు పెరగనున్నాయి. బ్లూస్టార్, గోద్రెజ్, హయర్, డైకిన్ వంటి సంస్థలు ఇప్పటికే ధరల పెంపును ప్రకటించాయి. ఎల్జీ, వోల్టాస్, హిటాచి బ్రాండ్ ఏసీలను విక్రయించే బాష్ హోమ్ కంఫర్ట్ కూడా సుమారు 5 శాతం ధరలను పెంచినట్లు తెలుస్తున్నది. ముడిసరుకుల ధరల పెరుగుదలవల్లే ధరలు పెంచక తప్పడం లేదని బ్లూస్టార్ ఎండీ బి త్యాగరాజన్ అన్నారు. రాగి ధర గత ఏడాదితో పోలిస్తే భారీగా



పెరిగిందని, అందుకే ఏసీల ధరలను 5 శాతం పెంచుతున్నామని హయర్ ఇండియా ప్రెసిడెంట్ ఎన్ఎస్ సతీష్ చెప్పారు. అయితే డీలర్ల దగ్గర పాత స్టాక్ ఒకటి, ఒకటిన్నర నెలలపాటు అందుబాటులో ఉండే అవకాశం ఉందని, కాబట్టి దీపావళి వరకు వినియోగదారులకు పాత ధరలకే ఉత్పత్తులు లభించవచ్చని నిపుణులు చెబుతున్నారు. దీపావళి తర్వాత కొత్త ధరలు పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తాయని అంచనా వేస్తున్నారు.

లిస్టింగ్ తప్పించేందుకు టాటా సన్స్ పునర్‌వ్యవస్థీకరణ

కంపెనీ బోర్డుకు టాటా ట్రస్ట్స్ ప్రతిపాదన



టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ అయిన టాటాసన్స్‌ను లిస్టింగ్ నుంచి తప్పించేందుకు అందులోని మెజారిటీ వాటాదారైన (66%) టాటా ట్రస్ట్స్ కీలక నిర్ణయం తీసుకుంది. టాటా సన్స్‌ను పునర్‌వ్యవస్థీకరించాలని బోర్డుకు ప్రతిపాదించింది. ఇందులో భాగంగా టాటా సన్స్‌లో రెండు ఆపరేటింగ్ కంపెనీలను విలీనం చేయాలని పేర్కొంది. తద్వారా స్టాక్ మార్కెట్ లిస్టింగ్ అవసరాన్ని తప్పించాలని భావిస్తోంది. ఈ మేరకు టాటా ట్రస్ట్స్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళికలో భాగంగా టాటా ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ , టాటా కన్సల్టింగ్ ఇంజినీర్స్ లను టాటా సన్స్‌లో విలీనం చేయాలని టాటా ట్రస్ట్స్ ప్రతిపాదించింది. ఈ ప్రణాళికను పరిశీలించాలని టాటా సన్స్ బోర్డుకు ప్రతిపాదనలు పంపించింది. ఈ విలీన ప్రక్రియ కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి ముందస్తు నిరభ్యంతర పత్రం పొందాల్సి ఉంటుంది.

ఎందుకీ నిర్ణయం?

ప్రతిపాదిత పునర్‌వ్యవస్థీకరణ వల్ల టాటా సన్స్ మళ్లీ ఆపరేటింగ్ కంపెనీగా మారుతుంది. ఈ విలీనం పూర్తయితే, టాటా సన్స్ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ లేదా కోర్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ నిబంధనల పరిధిలోకి రాదు. 2004లో టీసీఎస్ ప్రత్యేక అనుబంధ సంస్థగా విడిపోకముందు టాటా సన్స్ సొంతంగా వ్యాపార కార్యకలాపాలు, ఆదాయాలు కలిగి ఉండేదని టాటా సన్స్ గుర్తు చేసింది. తాజా విలీనంతో టాటా సన్స్ మళ్లీ తన పాత ఆపరేటింగ్ మోడల్‌లోకి మారుతుంది. తద్వారా నేరుగా వ్యాపార కార్యకలాపాలు సాగించే సంస్థగా మారుతుంది. టాటా సన్స్‌ను లిస్ట్ చేయకుండా 'అన్‌లిస్టెడ్ ప్రైవేట్ కంపెనీ' కొనసాగించాలన్న టాటా ట్రస్ట్స్ అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకుంది. టాటా సన్స్‌ను లిస్ట్ చేసే ప్రతిపాదనను మొదటి నుంచీ ట్రస్ట్స్ ఛైర్మన్ నోయల్ టాటా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే.

ఫ్లిప్‌కార్ట్ బిగ్‌బిలియన్ డేస్..
మోటోరొలా ఫోన్లపై డీల్స్ ఇవే!

బిగ్ బిలియన్‌డేస్ సేల్‌కు సిద్ధమవుతున్న ఫ్లిప్‌కార్ట్ ఒక్కో ఆఫర్‌ను రివీల్ చేసుకుంటూ వస్తోంది. అక్టోబర్ 9 నుంచి ప్రారంభం కానున్న మెగా సేల్‌లో విక్రయించే ఫోన్లపై మోటోరొలా తాజాగా ఆఫర్లు ప్రకటించింది. మోటో ఎడ్జ్, జీ సిరీస్ ఫోన్లతో పాటు సిగ్నేచర్‌పైనా డిస్కౌంట్ అందిస్తోంది. బ్లాక్ మెంబర్‌షిప్ ఉన్నవారు అక్టోబర్ 8 నుంచే ఈ ఆఫర్లు పొందొచ్చు.

మోటోఫోన్లపై ఆఫర్లు ఇవే..

ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్‌లో మోటోరొలా ఎడ్జ్ 70 ఫ్యూజన్ 8జీబీం128జీబీ వేరియంట్ మోడల్‌ను రూ.29,999కు విక్రయించనున్నారు. ప్రస్తుతం దీని ధర రూ.30,999 ఉంది. మోటోరొలా ఎడ్జ్ 70 ప్రో 8జీబీం 256జీబీ వేరియంట్‌ను రూ.36,999కు విక్రయించనున్నట్లు మోటో ప్రకటించింది. ప్రస్తుతం దీని ధర రూ.39,999 ఉంది. అంటే సేల్‌లో రూ.3 వేలు డిస్కౌంట్ లభించనుంది. మోటోరొలా ఎడ్జ్ 70 ప్రోం 12జీబీం 256జీబీ వేరియంట్ ధర ప్రస్తుతం రూ.47,999గా ఉండగా.. సేల్‌లో రూ.44,999కు లభించనుంది.

పెట్రోల్ బంకుల్లో డీజిల్ కొనుగోళ్లపై పరిమితులు!

దిల్లీ: ప్రైవేటు చమురు సంస్థలైన జియో-బీపీ, నయారా ఎనర్జీ డీజిల్ కొనుగోళ్లపై పరిమితులు విధిస్తున్నాయి. పరిశ్రమలు, బల్క్ వినియోగదారులు రిటెయిల్ ఔట్‌లెట్ల వద్ద కొనుగోళ్లు జరుపుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నాయి. జియో-బీపీ ఒక్కో కస్టమర్‌కు రోజుకు 50 లీటర్లు మాత్రమే విక్రయిస్తుండగా.. నయారా ఎనర్జీ మాత్రం 70-200 లీటర్ల వరకు కొనుగోళ్లకు అనుమతిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రభుత్వరంగ చమురు సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ కూడా విక్రయాలపై పరిమితులు విధించే అవకాశం ఉంది.

ధరలో రూ.40 వ్యత్యాసం

అంతర్జాతీయంగా ప్రస్తుతం బ్యారెల్ చమురు ధర 108 డాలర్లు పలుకుతోంది. అయితే, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచేందుకు మే నెల నుంచి రిటెయిల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా ఉంటున్నాయి. అదే సమయంలో పరిశ్రమలు, బల్క్ వినియోగదారులకు విక్రయించే డీజిల్ ధరలు అంతర్జాతీయ రేట్లకు అనుగుణంగా పెరిగాయి. దీంతో రిటెయిల్ పంపుల వద్ద లభించే డీజిల్‌కు, బల్క్



వినియోగదారులకు విక్రయించే డీజిల్‌కు మధ్య లీటరుపై దాదాపు రూ.40 వరకు వ్యత్యాసం ఉంటోంది. ఈ క్రమంలో బల్క్ వినియోగదారులు రిటెయిల్ పంపులను ఆశ్రయిస్తున్నారు. పరిశ్రమలు, తయారీ కంపెనీలు.. మెషినరీలు, బ్యాకప్ పవర్ సిస్టమ్‌లు రన్ చేయడానికి బల్క్‌గా డీజిల్‌ను కొనుగోలు చేస్తుంటాయి. అలాగే, టెలికాం కంపెనీలు, హోటళ్లు, మాల్స్, డేటా సెంటర్లు, హాస్పిటళ్లు సైతం ఎమర్జెన్సీ పవర్ కోసం డీజిల్ జనరేటర్లను వినియోగిస్తుంటాయి. ఇందుకోసం 400 నుంచి 600 లీటర్ల వరకు డీజిల్‌ను రిటెయిల్ ఔట్‌లెట్ల నుంచి కొనుగోలు చేస్తుంటాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనివల్ల రిటెయిల్ పంపుల వద్ద నిల్వలు వేగంగా పడిపోతున్నాయి. దీంతో సాధారణ వాహనదారులకు కొరత రాకుండా ఉండేందుకు ఈ పరిమితులు విధించినట్లు తెలుస్తోంది. పరిశ్రమల డిమాండ్ పెరిగిన నేపథ్యంలో రవాణా, వ్యక్తిగత ప్రయాణ అవసరాలకు ఇంధనం సరిపడా ఇంధనం అందేలా చూడటానికే తగిన చర్యలు తీసుకుంటున్నామని జియో-బీపీ తెలిపింది. నయారా ఎనర్జీ మాత్రం దీనిపై స్పందించలేదు. దేశంలో జియో-బీపీకి 2,227, నయారాకు 7,105 ఔట్‌లెట్లు ఉన్నాయి. ప్రభుత్వరంగ చమురు కంపెనీలకు మొత్తంగా 1,04,069 పెట్రోల్ పంపులు ఉన్నాయి. వీటిలో ఐఓసీకి 43,289, బీపీసీఎల్‌కు 25,587, హెచ్‌పీసీఎల్‌కు 25,238 చొప్పున ఉన్నాయి.

ఒకే రోజు 6 సెంచరీలు

వన్డే క్రికెట్ చరిత్రలోనే సరికొత్త ప్రపంచ రికార్డు

సెప్టెంబర్ 27, 2026.. వన్డే అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోయింది. ఒకే రోజున వేర్వేరు వేదికల్లో జరిగిన మూడు వన్డే మ్యాచ్‌ల్లో ఏకంగా 6 సెంచరీలతో కొత్త ప్రపంచ రికార్డు నమోదైంది. ఒకే రోజు 6 వన్డే సెంచరీలు నమోదు కావడం ఇదే తొలిసారి. అంతకుముందు 5 సెంచరీలు నమోదు కావడమే అత్యధిక రికార్డుగా ఉండేది.తాజాగా ఆ రికార్డు తుడిచిపెట్టుకు పోయింది. ఈ విషయాన్ని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ వేదికగా అధికారికంగా వెల్లడించింది.

ఈ ప్రపంచ రికార్డులో భాగమైన 6 సెంచరీల వివరాలు ఇవే:

విరాట్ కోహ్లి: తిరువనంతపురం వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో టీమిండియా స్టార్ విరాట్ కోహ్లి భారీ సెంచరీతో కదం తొక్కాడు. కేవలం 88 బంతుల్లో 10 ఫోర్లు, 9 సిక్స్‌లతో 139 పరుగులు చేశాడు.

కోహ్లికి తన వన్డే కెరీర్‌లో 55వ సెంచరీ, అంతర్జాతీయ క్రికెట్‌లో 86వ శతకం కావడం విశేషం. ఈ క్రమంలోనే వన్డేల్లో అత్యంత వేగంగా 15,000 పరుగులు పూర్తి చేసిన ప్లేయర్‌గా కోహ్లి నిలిచాడు.

శుబ్‌మన్ గిల్: ఇక ఇదే మ్యాచ్‌లో భారత కెప్టెన్ శుబ్‌మన్ గిల్ అద్భుతమైన సెంచరీ సాధించాడు. 108 బంతుల్లో 110 పరుగులు చేసి భారత్ 296 పరుగుల లక్ష్యాన్ని



సునాయాసంగా ఛేదించడంలో గిల్ కీలక పాత్ర పోషించాడు.

జస్టిన్ గ్రీవ్స్: తిరువనంతపురం వన్డేలో విండీస్ ఓపెనర్ జస్టిన్ గ్రీవ్స్ (12 ఫోర్లతో 101 పరుగులు) కూడా విరోచిత సెంచరీ నమోదు చేశాడు.

డేవిడ్ మిల్లర్: జోహాన్స్‌బర్గ్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన రెండో వన్డేలో సౌతాఫ్రికా ప్లేయర్ డేవిడ్ మిల్లర్ విధ్వంసకర సెంచరీతో విరుచుకుపడ్డాడు. కేవలం 93 బంతుల్లో 12 ఫోర్లు, 9 సిక్స్‌లతో 142 పరుగులు చేశాడు.

టెంబా బవుమా: ఇదే మ్యాచ్‌లో ప్రోటీస్ కెప్టెన్ టెంబా బవుమా కూడా సెంచరీతో చెలరేగాడు. 116 బంతుల్లో బవుమా 103 పరుగులు చేశాడు.

టామ్ బాంటన్ : లండన్ వేదికగా శ్రీలంకతో జరిగిన సిరీస్ డిసైడర్ మూడో వన్డేలో ఇంగ్లండ్ ఓపెనర్ టామ్ బాంటన్ 126 (105 బంతుల్లో) శతక్కొట్టాడు.

స్పోర్ట్స్

మళ్లీ పసిడి దక్కలే..
5 వేల స్టీపుల్ చేజ్‌లోనూ పారుల్‌కు కాంస్యమే



ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పసిడి పతకానికి దూరమవుతున్నారు. మెరుగైన ప్రదర్శన చేస్తున్నా సరే వెండితో లేదా కాంస్యంతోనో సరిపెట్టుకుంటున్నారు. నగోయలో సీనియర్ స్ప్రింటర్ పారుల్ చౌదరీ పతక వేట కొనసాగుతోంది. మహిళల 3వేల మీటర్ల స్టీపుల్ ఛేజ్‌లో కాంస్యం సాధించిన తను.. రోజు వ్యవధిలోనే దేశానికి మరో పతకం అందించింది. సోమవారం మహిళల 5వేల మీటర్ల స్టీపుల్ ఛేజ్ ఫైనల్లో సత్తా చాటిన పారుల్ మూడో స్థానంలో నిలిచింది. పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో పారుల్ చౌదరీ మరో పతకం కొల్లగొట్టింది. ఇప్పటికే మహిళల 3 వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో కాంస్యంతో మెరిసిన ఈ వెటరన్ ఈసారి 5వేల మీటర్ల స్టీపుల్ ఛేజ్‌లోనూ తళుక్కుమంది. సోమవారం జరిగిన ఫైనల్లో మూడో స్థానంతో కాంస్యంను ఒడిసిపట్టింది తను. పసిడి పోరులో ఆమె 15:14.61 సెకన్లలో పరుగు పూర్తి చేసింది. అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన కంటే 10 సెకన్లు ఆలస్యంగా పరుగెత్తింది పారుల్. గత ఎడిషన్ ఆసియాడ్‌లో స్వర్ణ పతకం పట్టేసిన పారుల్ ఈసారి కంచుమోతతోనే సరిపెట్టుకుంది. ఈ విభాగంలో కెన్యా అథ్లెట్ విన్‌ఫ్రెడ్ యవి (ఔఅటతీవన్ఘజఱ) ప్రథమ స్థానంలో నిలిచి పసిడిని ఎగరేసుకుపోయింది.

జావెలిన్‌లో 'డబుల్' జోష్..
లాంగ్ జంప్‌లో శ్రీశంకర్ వెండి వెలుగులు



పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పసిడి వేటలో తడబడినా.. వెండి, కాంస్యాలతో మెరుస్తున్నారు. లాంగ్ జంప్‌లో మురళీ శ్రీశంకర్ అదరగొడుతూ వెండి సాధించాడు. జావెలిన్ త్రోలో ఏకంగా రెండు పతకాలు భారత్ ఖాతాలో చేరాయి. యశ్వీర్ సింగ్ సిల్వర్, రోహిత్ యాదవ్ కాంస్యం కొల్లగొట్టగా.. బాక్సర్లు సూపర్ పంచ్‌తో మరో మూడు పతకాలు ఖరారు చేశారు. మహిళల విభాగంలో లొవ్లీనా బర్గోహైన్(75 కిలోలు), ప్రియా గంఘాస్, కపిల్ పొఖారియా(90 ప్లస్ కిలోలు)లు సెమీఫైనల్‌కు దూసుకెళ్లారు. మొత్తంగా.. బాక్సింగ్‌లో ఆరు పతకాలు ఖాయమమ్మాయి. ఐచీ నగోయ ఆతిథ్యమిస్తున్న 18వ ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ మురళీ శ్రీశంకర్ రజతం సాధించాడు. పురుషుల లాంగ్ జంప్ ఫైనల్లో గాయపడిన అతడు చివరి రెండు ప్రయత్నాల్లో దూకలేదు. మోకాలి గాయం వేధించడంతో 8.07 మీటర్లతో రెండో స్థానంలో నిలిచిన అతడు.. చివరకు వెండిని అందుకున్నాడు. ఇదే విభాగంలో భారత అథ్లెట్ డేవిడ్ సొలొమాన్ 7.70 మీటర్ల దూరం దూకి ఏడో స్థానంతో నిరాశపరిచాడు. కాసేపటికే జావెలిన్ త్రోలో భారత అథ్లెట్లు యశ్వీర్ సింగ్, రోహిత్ యాదవ్‌లు అదరగొట్టారు. ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా గైర్హాజరీలో పతక బాధ్యత తీసుకున్న ఈ ఇద్దరూ రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. హోరాహోరీగా సాగిన ఫైనల్లో రుమేశ్ పతిరంగ(శ్రీలంక) 88.55 మీటర్లతో పసిడి సాధించగా.. యశ్వీర్ చివరి ప్రయత్నంలో అత్యుత్తమంగా 85.72మీ, రోహిత్ 84.68మీ దూరం ఈటెను విసిరి వరసగా వెండి, కాంస్యాలు ఒడిసిపట్టారు.

5-0తో గెలుపొంది


కామన్వెల్త్ క్రీడల్లో తేలిపోయిన బాక్సర్ లొవ్లీనా బొర్గోహైన్ ఆసియాడ్‌లో మెరిసింది. క్వార్టర్ ఫైనల్లో దక్షిణ కొరియా బాక్సర్‌పై పంచ్‌ల వర్షం కురిపించింది. ఏకపక్ష పోరులో 5-0తో గెలుపొందిన లొవ్లీనా దర్జాగా సెమీస్‌లో అడుగుపెట్టింది. పురుషుల 90 ప్లస్ కిలోల ఫైట్‌లో కపిల్ పొఖారియా ధాటికి దక్షిణ కొరియా బాక్సర్ కిమ్ గిచాయే చేతులెత్తేశాడు.



ఓటీటీలోకి కార్తీ సర్దార్ 2 మూడు వారాల్లోనే డిజిటల్ ఎంట్రీ!

తమిళ హీరో కార్తీ నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్ 2' ఇప్పుడు ఓటీటీలో సందడి చేసేందుకు సిద్ధమైంది. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా.. కార్తీ కెరీర్‌లో విజయవంతమైన చిత్రాల్లో ఒకటైన 'సర్దార్'కు కొనసాగింపుగా రూపొందింది. భారీ అంచనాలతో థియేటర్లలోకి వచ్చిన ఈ సీక్వెల్ మాత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. తమిళంతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ సినిమాకు మిశ్రమ స్పందనే లభించింది. ఇప్పుడు థియేట్రికల్ రన్ ముగించుకుని డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో 'సర్దార్ 2' అక్టోబర్ 1 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ముఖ్యంగా ఈ సినిమా థియేటర్లలో సెప్టెంబర్ 10న విడుదల కాగా.. కేవలం మూడు వారాల్లోనే ఓటీటీలోకి వస్తుండటం గమనార్హం. అంతేకాదు.. ఓటీటీ విడుదలను కేవలం తమిళానికి మాత్రమే పరిమితం చేయకుండా పలు భాషల్లో అందుబాటులోకి తీసుకురానున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రేక్షకులు ఈ సినిమాను వీక్షించవచ్చు. థియేటర్లలో మిస్ అయిన వారికి, మరోసారి సినిమాను చూడాలనుకునే కార్తీ అభిమానులకు ఇది మంచి అవకాశం కానుంది. 'సర్దార్ 2'లో కార్తీ మరోసారి విభిన్నమైన పాత్రల్లో కనిపించారు. ఈ సినిమాలో ఆయన తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేశారు. రా ఏజెంట్ చంద్రబోస్ అలియాస్ సర్దార్ పాత్రలో ఒక వైపు కనిపిస్తే.. మరోవైపు ఇన్‌స్పెక్టర్ విజయ్ ప్రకాష్‌గా నటించారు. ఈ రెండు పాత్రల మధ్య ఉండే వ్యత్యాసం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్ కథానాయికలుగా నటించగా.. ఎస్.జే. సూర్య ప్రతినాయకుడి పాత్రలో కనిపించారు. స్పై యాక్షన్ అంశాలతో పాటు భారీ యాక్షన్ సన్నివేశాలతో సినిమాను తెరకెక్కించారు. ప్రిన్స్ పిక్చర్స్, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై ఎస్. లక్ష్మణ్ కుమార్, ఇషాన్ సక్సేనా ఈ చిత్రాన్ని నిర్మించారు. సామ్ సీఎస్ సంగీతం అందించగా.. జార్జ్ సి. విలియమ్స్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. విజయ్ వేలుకుట్టి ఎడిటింగ్ చేశారు. తెలుగులో ఈ సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్ విడుదల చేసింది. థియేటర్లలో ఆశించిన స్థాయిలో ఫలితం అందుకోలేకపోయిన 'సర్దార్ 2'.. ఓటీటీలో మాత్రం ఎలాంటి స్పందనను అందుకుంటుందో చూడాలి. ముఖ్యంగా బహుభాషల్లో స్ట్రీమింగ్ కావడంతో డిజిటల్ ప్రేక్షకుల్లో సినిమాపై మరోసారి ఆసక్తి ఏర్పడే అవకాశం ఉంది.

మండాడి రికార్డ్ మైల్‌స్టోన్ స్టార్ హీరోకు ధీటుగా దూసుకెళ్తున్న సూరి




టాలీవుడ్ యాక్టర్ సుహాస్, తమిళ నటుడు సూరి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం మండాడి సుహాస్ కోలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈ మూవీని సెల్ఫీ ఫేం మతిమారన్ పుగళేంది డైరెక్ట్ చేశాడు. రూరల్ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన మండాడి సూరి కెరీర్‌లో గ్లోబల్‌వైడ్‌గా రూ.100 కోట్ల గ్రాస్ సాధించిన తొలి సినిమాగా నిలిచింది. మండాడి తెలుగు వెర్షన్ కూడా కమర్షియల్ సక్సెస్ అందుకుంది. సూరి సొంత రాష్ట్రం తమిళనాడులో బాక్సాఫీస్ వద్ద రూ.80 కోట్లు వసూలుచేసిన ఈ మూవీ రూ.100 కోట్ల మైల్ స్టోన్ దిశగా ముందుకెళ్తోంది. సాధారణంగా స్టార్ హీరోల సినిమాలే ఈ మార్క్‌ను చేరుకుంటాయి. ఒకవేళ మూడంకెల డిజిట్‌ను దాటుకుందంటే సూరి కెరీర్‌లో ఇదొక హిస్టారికల్ అఛీవ్‌మెంట్‌గా నిలిచిపోనుంది. తీర ప్రాంతం, మత్స్యకారుల నేపథ్యంలో స్పోర్ట్స్ డ్రామాగా వస్తోన్న ఈ మూవీలో సుహాస్ సాట్టపులి రోల్‌లో నటించాడు. మహిమా నంబియార్ కీలక పాత్రలో నటించగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, అచ్యుత్ కుమార్ ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీకి జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించగా.. ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ తెరకెక్కించింది. మరి రాబోయే రోజుల్లో మండాడి బాక్సాఫీస్ వసూళ్లు ఎలా ఉండబోతున్నాయన్నది ఆసక్తికరంగా మారింది.

నెట్‌ఫ్లిక్స్‌లోకి అడుగుపెడుతున్న చిరంజీవి.. సినిమాతో కాకుండా సరికొత్త పాడ్‌కాస్ట్‌తో సందడి



మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు మరో ఆసక్తికరమైన వార్త వినిపిస్తోంది. దశాబ్దాలుగా తెలుగు సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన చిరంజీవి.. ఇప్పుడు డిజిటల్ వేదికపై సరికొత్త ప్రయోగానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ కోసం ఆయన ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని చేయనున్నారనే వార్తలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. చిరంజీవి ప్రధానంగా సినిమాల్లోనే కనిపిస్తుంటారు. అయితే ఈసారి సినిమాకు భిన్నంగా ఆయన ఒక పాడ్‌కాస్ట్‌కు వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమం ద్వారా తన వ్యక్తిగత, సినీ జీవితంలోని అనుభవాలను ప్రేక్షకులతో నేరుగా పంచుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. వాస్తవానికి చిరంజీవితో ఓ డాక్యుమెంటరీ రూపొందించాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టినట్లు సమాచారం. అయితే తన జీవిత ప్రయాణం, సినీ అనుభవాలు, ఎదుర్కొన్న సవాళ్లు, విజయాలు, మరచిపోలేని సంఘటనల గురించి మరింత స్వేచ్ఛగా మాట్లాడేందుకు పాడ్‌కాస్ట్ రూపం సరైనదని చిరంజీవి భావించినట్లు కథనాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ప్రముఖులు తమ జీవిత విశేషాలను సంభాషణల రూపంలో ప్రేక్షకులతో పంచుకునే కార్యక్రమాలకు మంచి ఆదరణ ఉండటంతో ఈ విధానాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది.ఈ పాడ్‌కాస్ట్‌లో చిరంజీవి తన కెరీర్‌లోని ఎన్నో ఆసక్తికరమైన విషయాలను గుర్తు చేసుకునే అవకాశం ఉంది. నటుడిగా ఎదిగిన తొలి రోజుల నుంచి స్టార్‌గా మారిన ప్రయాణం, సినీ రంగంలో ఎదురైన సవాళ్లు, కీలక మలుపులు, విజయాలు, తనకు ప్రత్యేకమైన సినిమాలు, మరచిపోలేని అనుభవాలు వంటి అంశాలపై ఆయన మాట్లాడనున్నట్లు సమాచారం. అంతేకాదు.. ఇన్నేళ్ల సినీ ప్రయాణంలో తనకు ఎదురైన వ్యక్తిగత అనుభవాలు, పరిశ్రమలో మారిన పరిస్థితులు, తన ఆలోచనా విధానం వంటి విషయాలను కూడా చిరంజీవి పంచుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో సాధారణంగా ఇంటర్వ్యూల్లో చెప్పని ఎన్నో విషయాలు ఈ కార్యక్రమం ద్వారా బయటకు రావచ్చనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.ఈ కార్యక్రమానికి మరో ప్రత్యేకత కూడా ఉన్నట్లు సమాచారం. చిరంజీవి కుమార్తె, నిర్మాత సుష్మిత కొణిదెల ఈ పాడ్‌కాస్ట్‌ను నిర్మించనున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. అదే నిజమైతే తండ్రి చిరంజీవి కోసం ఆమె నిర్మాణ బాధ్యతలు చేపట్టే మరో ఆసక్తికరమైన ప్రాజెక్టుగా ఇది నిలవనుంది.అయితే ఈ పాడ్‌కాస్ట్‌కు సంబంధించి నెట్‌ఫ్లిక్స్ లేదా చిరంజీవి కుటుంబం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అధికారికంగా ధృవీకరణ వచ్చిన తర్వాత కార్యక్రమం ఎప్పుడు ప్రారంభమవుతుంది, ఎన్ని భాగాలు ఉంటాయి, ఎలాంటి అంశాలపై చిరంజీవి మాట్లాడనున్నారు వంటి విషయాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



బాలయ్య తర్వాత ప్రభాస్.. ఈసారి బాహుబలి వార్ సీన్‌తో ఇరాన్ వార్నింగ్!

తెలుగు సినిమా సత్తా మరోసారి అంతర్జాతీయ స్థాయిలో చర్చకు వచ్చింది. అమెరికా--ఇరాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ దౌత్య కార్యాలయాలు తమ సోషల్ మీడియా పోస్టులకు తెలుగు సినిమాల్లోని యాక్షన్ సన్నివేశాలను ఉపయోగించడం ఆసక్తికరంగా మారింది. తాజాగా హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సులేట్ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన 'బాహుబలి: ది బిగినింగ్'లోని ప్రముఖ యుద్ధ సన్నివేశాన్ని షేర్ చేసింది.ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన 'బాహుబలి'లో ప్రభాస్ పోషించిన అమరేంద్ర బాహుబలి కాలకేయుల సైన్యంతో తలపడే సన్నివేశాన్ని ఇరాన్ కాన్సులేట్ తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకుంది. ఈ వీడియోకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఇటీవల ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో చేసిన వ్యాఖ్యలను జోడించింది. "మేము తలవంచం.. మోకరిల్లం" అనే పెజెష్కియాన్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, కాలకేయులను ఎదుర్కొన్న బాహుబలిలాగే తమ దేశం కోసం తాము కూడా త్యాగానికి సిద్ధంగా ఉన్నామని సందేశంలో పేర్కొంది. ఈ విధంగా ఒక అంతర్జాతీయ రాజకీయ అంశానికి 'బాహుబలి' యుద్ధ సన్నివేశాన్ని ప్రతీకగా ఉపయోగించడం సోషల్ మీడియాలో విపరీతమైన దృష్టిని ఆకర్షిస్తోంది. ఇరాన్ దౌత్య సంస్థలు తెలుగు సినిమాలను సోషల్ మీడియా సందేశాల్లో ఉపయోగించడం ఇదే తొలిసారి కాదు. కొద్ది రోజుల క్రితం జింబాబ్వేలోని ఇరాన్ రాయబార కార్యాలయం నందమూరి బాలకృష్ణ నటించిన 'భగవంత్ కేసరి' చిత్రంలోని యాక్షన్ సన్నివేశాన్ని షేర్ చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఐక్యరాజ్యసమితి వేదికగా ఇరాన్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఈ వీడియోను పోస్ట్ చేసింది. ఇరాన్‌ను అంత సులభంగా ఎదుర్కోలేరనే భావనను వ్యక్తం చేస్తూ ఆ పోస్ట్‌లో వ్యాఖ్యలు చేసింది. అయితే ఆ పోస్టులో 'భగవంత్ కేసరి'ని బాలీవుడ్ సినిమాగా పేర్కొనడం మాత్రం చర్చకు దారితీసింది. నిజానికి ఇది తెలుగు సినిమా కావడంతో భారతీయ నెటిజన్లు ఈ విషయాన్ని గుర్తుచేస్తూ కామెంట్లు చేశారు.ఇప్పుడు అదే తరహాలో మరోసారి తెలుగు సినిమా నుంచి ప్రభాస్ 'బాహుబలి'ని ఇరాన్ దౌత్య సంస్థ ఎంచుకోవడంతో తెలుగు సినిమా అభిమానులు ఆసక్తిగా స్పందిస్తున్నారు.'బాహుబలి' యుద్ధ సన్నివేశాన్ని ఇరాన్ తన రాజకీయ సందేశానికి ఉపయోగించడం నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది. అంతర్జాతీయ దౌత్య సందేశంలో భారతీయ సినిమా, అందులోనూ తెలుగు సినిమాకు చెందిన సన్నివేశాన్ని ఉపయోగించడం ఆసక్తికర పరిణామంగా పలువురు పేర్కొంటున్నారు.

ఆకలి ముందు అన్నీ ఓడిపోతాయిరా.. జరీనా వహాబ్ గ్లింప్స్‌తో హైప్ పెంచేస్తున్న పూరీ టీం



టాలీవుడ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తోన్న మూవీ 'స్లమ్‌డాగ్ -- 33 టెంపుల్ రోడ్' ఒక్క వాన పడితే కాకుల్లా చెట్ల కింద దాక్కునే జీవితాలు మావి అలాంటి మా బతుకులతో ఆడితే నేనెందుకు వదులుతా అంటూ ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్ నెట్టింట హైప్ పెంచేస్తోంది. తాజాగా ఈ మూవీ నుంచి జరీనా వహాబ్ గ్లింప్స్‌ను షేర్ చేసింది పూరీ టీం. నాంపల్లి స్టేషన్‌కు వెళ్లి ట్రైన్ కింద తలపెట్టి చచ్చిపోదామనుకున్నాను. కానీ ధైర్యం సరిపోలేదు. ఈ ఆకలి ముందు అన్నీ ఓడిపోతాయి రా.. సిగ్గు, లజ్జ, మానం, మర్యాద అన్నీ మంటకలిసిపోతాయి. కానీ బేటా ఆకలితో ప్రాణాలు తోడేస్తుంటే నాకు తెలియకుండానే నా చేతులు అడుక్కోవడం మొదలుపెట్టాయి.. అంటూ జరీనా వహాబ్ చెబుతున్న డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. పూరీ మార్క్ డైలాగ్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు తాజా గ్లింప్స్ చెప్పకనే చెబుతోంది. ఈ చిత్రానికి రమీ సంగీతం అందిస్తున్నాడు. ఛార్మి కౌర్ సమర్పకురాలిగా వ్యవహరిస్తున్న ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్, జె.బి. మోషన్ పిక్చర్స్ బ్యానర్లపై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్, జె.బి. నారాయణరావు కొండ్రోళ్ల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ మూవీ విజయ్ సేతుపతికి జోడీగా సంయుక్తా మీనన్ నటిస్తుండగా.. టబు, దునియా విజయ్, బ్రహ్మాజీ, వి.టి.వి. గణేష్, విష్ణు రెడ్డి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పాన్ ఇండియా లెవెల్‌లో తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999